www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -309 శనివారం14 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ‘పట్టణం’ హస్తానిదే

## 68 మున్సిపాల్టీల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం

**బీఆర్ఎస్ 14కే పరిమితం -33 చోట్ల హంగ్**

**1,530 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు**

**775 స్థానాలతో రెండో స్థానంలో బీఆర్ఎస్**

**4 కార్పొరేషన్లలో కాంగ్రెస్ పాగా**

**నిజామాబాద్, కరీంనగర్‌లో బీజేపీకి మెజార్టీ స్థానాలు**

**16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ల ఎన్నిక**





హైదరాబాద్ **ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. మొత్తం 116 మున్సిపాల్టీలు, ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. వాటిలో 64 మున్సిపాల్టీలు, 4 కార్పొరేషన్లలో కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మెజారిటీ సాధించింది. 14 మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ గెలిచింది. బీజేపీ ఏ మున్సిపాల్టీలోనూ స్పష్టమైన ఆధిక్యతను కనబర్చలేదు. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లలో హంగ్ ఏర్పడింది. ఇక్కడ బీజేపీ అత్యధిక స్థానాల్ని గెలిచింది. కొత్తగూడెం మున్సిపాల్టీని బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కైవసం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో 2996 వార్డులో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 12 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ఒక వార్డులో ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 2,983 స్థానాలకు ఎన్నికలు జరిగాయిమిగతా 2లో...

# ‘సేవాతీర్థ్’లోకి పీఎంవో

## ప్రధాని కార్యాలయానికి కొత్త చిరునామా

**‘న్యూఢిల్లీ’ ఏర్పడిన రోజే నాంది**

**కొత్త భవనాలను ప్రారంభించిన ప్రధాని**



న్యూఢిల్లీ, **ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** దేశ రాజధాని చరిత్రలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. దాదాపు 95 ఏళ్లపాటు ఒకే భవనంలో కొనసాగిన ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) తొలిసారి కొత్త చిరునామా పొందింది. కొత్త భవనం ‘సేవాతీర్థ్’లోకి శుక్రవారం లాంఛనంగా మారింది. ఆధునిక రౌజధాని నగరంగా న్యూఢిల్లీ ఏర్పడిన రోజే ఈ అపూర్వ ఘటన చోటుచేసుకోవడం విశేషం. పీఎం రాహత్, లఖ్‌పతి దీదీలు, రైతులు, స్టార్టప్‌లకు సంబంధించిన ఫైళ్లపై సంతకం చేయడం ద్వారా ప్రధాని మోదీ శుక్రవారం కొత్త కార్యాలయం నుంచి పాలనను ప్రారంభించారు. ఇప్పటివరకు ఢిల్లీలోని సౌత్ బ్లాక్ నుంచిమిగతా 2లో...

# ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

**మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండో దశ**

**చివరి రోజూ ప్రతిపక్షాల ఆందోళనలు**

**అమెరికాతో ట్రేడ్ డీల్, ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై నిరసనలు**

**పలు అంశాలపై కేంద్రాన్ని నిలదీసిన సభ్యులు**



# మెరుగైన ఫలితాలు సాధించాం

**కాంగ్రెస్, బీజేపీలను నిరోధించడమే లక్ష్యం**

**సింగరేణిలో దోపిడీకి అడ్డుకట్ట వేయాలి**

**కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐకి మద్దతు**

**మా అభ్యర్థులను బెదిరిస్తున్న కాంగ్రెస్**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




**హైదరాబాద్ ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** మున్సిపల్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను సాధించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) అన్నారు. బీఆర్ఎస్‌కు మద్దతుగా అండగా నిలబడ్డ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో

# ప్రజాభిమానమే విజయానికి కారణం


**అత్యధిక సీట్లు కట్టబెట్టినందుకు కృతజ్ఞతలు**

**ఎక్స్ వేదికగా ఫలితాలపై సీఎం రేవంత్ స్పందన**



# 3.32 లక్షల కోట్లతో నేడే బడ్జెట్

అమరావతి, **ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** రాష్ట్రప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను శనివారం శాసనసభ, మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ దఫా బడ్జెట్ దాదాపు రూ.3.32 లక్షల కోట్లుగా ఉండే అవకాశముంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26)లో రూ.3,22,359 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా.. ఈసారి దాదాపు రూ.10,000 కోట్లు పెంచనున్నట్లు సమాచారం. అసెంబ్లీలో ఉదయం 11:15 నిమిషాలకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. దానికి ముందు పదిన్నర గంటలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుంది. పయ్యావుల బడ్జెట్ పెట్టిన తర్వాత వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను సభ ముందుంచుతారు. మిగతా 2లో...





# పాలకమండళ్లు పటిష్టంగా ఉంటే అపచారాలు జరగవు

**రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించాలి**

**గత ప్రభుత్వంలో జరిగిన అపచారాలు పునరావృతం కారాదు**

**శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణను వర్చువల్‌గా ప్రారంభించిన పవన్**

అమరావతి,**ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** దేవాలయాల పరిరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. పాలక మండళ్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తే దేవాలయాల్లో అపచారాలు జరగవని, రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పాలక మండళ్లపై ఉందని పవన్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మిగతా 2లో...

# నల్లమలసాగర్‌పై తెలంగాణ అభ్యంతరం చెప్పడం తగదు

**: సీఎం చంద్రబాబు**



**2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని వెల్లడి**

**ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం**

**ఆరోగ్య సేవల మెరుగుకు సంజీవని.. ఫిబ్రవరి 16న రాష్ట్రానికి బిల్ గేట్స్**

**విశాఖకు గూగుల్, టీసీఎస్.. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ భారీ రిఫైనరీ**

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# 3.32 లక్షల కోట్లతో నేడే బడ్జెట్

(మొదటి పేజి తరువాయి)

హోం మంత్రి అనిత శాసనమండలిలో రాష్ట్ర బడ్జెట్‌ను, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం ఉభయసభలూ వాయిదాపడతాయి. 17, 18 తేదీల్లో బడ్జెట్‌పై చర్చించి ఆమోదం తెలుపుతాయి. కాగా.. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలకు రెవెన్యూ లోటు నిధులను పూర్తిగా నిలిపివేశారు. దీంతో మన రాష్ట్రానికి ఏడాదికి రూ.10,000 కోట్లు తగ్గిపోయినట్లే. ఇతర గ్రాంట్లను కూడా కేంద్రం నిలిపివేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా పెరుగుతుందని భావించినా అతి స్వల్పంగా పెరిగింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా కొంత అప్రమత్తమైంది. సాధారణంగా ప్రతి ఏటా బడ్జెట్‌ను 10 శాతం పెంచుతూ వస్తున్నారు. ఈసారి మాత్రం కేవలం రూ.10,000 కోట్లే పెంచినట్లు తెలిసింది. అభివృద్ధి, సంక్షేమం, మహిళలు, రైతులకు ప్రాధాన్యమిస్తూ.. ముఖ్యంగా సూపర్ సిక్స్ హామీల అమలుకు నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. పారిశ్రామిక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తారని అంటున్నారు. రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణంపై కూడా దృష్టి సారిస్తున్నారు.

# పాలకమండళ్లు పటిష్టంగా ఉంటే అపచారాలు జరగవు

తిరుమలలోనే ఎన్నో అపచారాలు జరిగాయన్నారు. నాటి పాలక మండలి బాధ్యతగా వ్యవహరిస్తే తప్పులు జరిగేవి కాదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆలయ పాలక మండళ్లు గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు, అపచారాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మించిన శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ రోడ్డును వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి పవన్ కల్యాణ్ వర్చువల్ గా ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఆలయాలు నాగరికతకు చిహ్నాలు అన్నారు. మన కళలు, మన వారసత్వం, మన సంస్కృతి, ధర్మ పరిరక్షణ ఆలయాలతో ముడిపడి ఉన్నాయి. అరుణాచలంలో గిరిప్రదక్షణ చేస్తారు అని తెలుసు.. నాకు గిరిప్రదక్షణ చేయాలని చాలా కోరిక ఉంది. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆహ్వానం మేరకు, భక్తుల కోరిక మేరకు త్వరలో శ్రీకాళహస్తి క్షేత్రాన్ని సందర్శించి కచ్చితంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటానన్నారు.. శివరాత్రికి రెండు రోజుల ముందు ఈ శ్రీకాళహస్తి గిరి ప్రదక్షణ మార్గాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు పవన్.. గత ప్రభుత్వం ఆలయాల పరిరక్షణ అంశాన్ని చాలా నిర్లక్ష్యం చేసిందన్నారు.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేవాదాయ మంత్రిగా రామనారాయణ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఆలయాల పరిరక్షణను ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకువెళ్తున్నాం అన్నారు. నిరాదరణకు గురైన ఎన్నో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారని.. భక్తులు కోరుకుంటే ఏజెన్సీలో కూడా ఆలయాలు నిర్మించాలన్న ఆయన గొప్ప సంకల్పానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా అన్నారు పవన్ కల్యాణ్..శివరాత్రి తర్వాత గిరిప్రదక్షణ మార్గంలో మొక్కలు నాటుతామని.. శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ మార్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రూ. 10 కోట్లు వెచ్చించి సిమెంటు రోడ్డు నిర్మించామన్నారు. 22 కిలోమీటర్ల గిరి ప్రదక్షణ మార్గాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం అన్నారు.. అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరిప్రదక్షణ మార్గానికి ఇరు వైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీకారం చుట్టబోతున్నాం అన్నారు.. శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ ద్వారా ప్రతి భక్తుడికి కైలాసగిరి ప్రదక్షణ చేసిన పుణ్యఫలం దక్కాలని ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాన్నారు.సంక్షేమ ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదని ఆధ్యాత్మిక ఆంధప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని.. ఇందుకోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. 15,016 ఆలయాలకు పాలకమండళ్లను వేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే సుమారు వెయ్యి ఆలయాలకు పాలమండళ్లను నియమించామని చెప్పుకొచ్చారు. మిగిలిన వాటిపైనా దృష్టి సారిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు.

# 'సేవాతీర్థ్'లోకి పీఎంవో

(మొదటి పేజి తరువాయి)

పీఎంవో విధులు నిర్వహించింది. 95 ఏళ్ల క్రితం, 1931 ఫిబ్రవరి 13వ తేదీన న్యూఢిల్లీ నగరం అధికారికంగా అందుబాటులోకి వచ్చింది. పాలనా అవసరాల కోసం అప్పుడు నిర్మించిన సౌత్ బ్లాక్, నార్త్ బ్లాక్‌ల్లోనే పీఎంవో, ముఖ్యమైన మంత్రిత్వ శాఖలు పనిచేయడం మొదలుపెట్టాయి. 1947లో దేశ స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆ తర్వాత మూడేళ్లకు, 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. అరుదైన ఈ ఘట్టాలకు మౌన చారిత్రక సాక్షిగా నిలిచిన రైసినా హిల్స్ కాంప్లెక్స్ పక్కనే 'సేవాతీర్థ్'ను నెలకొల్పారు. పీఎంవో, జాతీయ భద్రతా మండలి సచివాలయం, క్యాబినెట్ సచివాలయం ఇప్పటివరకు వేర్వేరుగా కొనసాగాయి. వాటిని ఇప్పుడు ఒకే గొడుగు కిందకు తెచ్చారు. సెంట్రల్ విస్టా పథకంలో భాగంగా ఈ మూడు విభాగాలూ ఇకపై ఒకే భవన సముదాయంలో పని చేయనున్నాయి. కొత్త భవన ప్రారంభోత్సవానికి గుర్తుగా రూ.వంద నాణేన్ని ప్రధాని ఆవిష్కరించారు. "'ఇండియా ఫస్ట్' లక్ష్యంగా మరింత గౌరవ, వినమ్రతలతో దేశ ప్రజలకు కొత్త కార్యాలయం నుంచి సేవలు అందిస్తాం. కర్తవ్య నిర్వహణ, సేనా తత్పరత, సంకల్పాలకు ఉజ్వల ప్రతీకగా 'సేవాతీర్థ్'గా ఉంటుంది" అన్నారు.

పలు కీలక మంత్రిత్వ శాఖల కోసం కొత్తగా నిర్మించిన కర్తవ్య భవన్-1,2 కార్యాలయాలను ప్రధాని మోదీ ప్రారంభించారు. రైసినా హిల్స్ కాంప్లెక్స్‌కు సమీపంలోనే వీటినీ ఏర్పాటుచేశారు. న్యాయ, రక్షణ, ఆర్థిక, ఆరోగ్య, వ్యవసాయం తదితర శాఖలు ఇకపై ఇక్కడినుంచి పని చేయనున్నాయి. కీలక మంత్రిత్వ శాఖలు ఇప్పటివరకు సౌత్, నార్త్ బ్లాకుల్లో విధులు నిర్వహించాయి. నార్త్ బ్లాక్‌లో హోంశాఖ, ఆర్థిక శాఖ కార్యాలయాలు ఉంటే; సౌత్ బ్లాక్‌లో పీఎంవోతో పాటు రక్షణ శాఖ కార్యాలయాలు ఉండేవి. కాగా, 'సేవాతీర్థ్'లో పాలనను ముఖ్యమైన ఫైళ్లపై సంతకం చేయడం ద్వారా ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. నారీ శక్తిలో భాగంగా.. లఖ్‌పతి దీదీల సంఖ్యను రెట్టింపు చేస్తూ, ఆరు కోట్ల మందిని లక్షాధికారులను చేసే ఫైల్‌పై ప్రధాని సంతకం చేశారు. అలాగే, వ్యవసాయ మౌలిక వసతుల నిధి పరిధిని రూ.లక్ష కోట్ల నుంచి రూ.2లక్షల కోట్లకు విస్తరించారు. కాగా, పీఎంవో సహా కీలక శాఖల కార్యాలయాల తరలింపుతో ఖాళీ అయిన సౌత్, నార్త్ బ్లాక్ భవనాలను జాతీయ మ్యూజియం కోసం కేటాయించనున్నారు. **'పీఎం రాహత్'పై ప్రధాని తొలి సంతకం**

ప్రధాని తన నూతన కార్యాలయంలో 'పీఎం రాహత్' పథకాన్ని ఆమోదిస్తూ తొలి సంతకం చేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకూ నగదు రహిత చికిత్స ఈ పథకంతో అందుబాటులోకి రానుంది.ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో ఉచిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ప్రమాదం జరిగిన నాటి నుంచి 7రోజుల్లోగా ఈ సేవలను పొందవచ్చు.

# ప్రజాభిమానమే విజయానికి కారణం

## అత్యధిక సీట్లు కట్టబెట్టినందుకు కృతజ్ఞతలు

## ఎక్స్ వేదికగా ఫలితాలపై సిఎం రేవంత్ స్పందన

హైదరాబాద **ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** :తెలంగాణ మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితమని.. పార్టీ పట్ల వారికి ఉన్న అనంతమైన అభిమానానికి నిదర్శనమని కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితమని రేవంత్ అన్నారు. రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలన, పేద- మధ్య తరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని అన్నారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు రేవంత్. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితం అవుతామన్నారు. భవిష్యత్‌లో ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌ను గొప్పగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని చెప్పుకొచ్చారు.

అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. మహిళలను కించపరచకూడదనే విజ్ఞత ఉండొద్దా..? అలాంటి వారిని, ఇలాంటి మాటలను ప్రోత్సహించవద్దని కోరుతున్నా. వైసీపీ మాజీ మంత్రి అని అంబటిపై మేం కక్ష సాధింపులకు పాల్పడటం లేదు" అని లోకేశ్ స్పష్టం చేశారు.

# నల్లమలసాగర్‌పై తెలంగాణ అభ్యంతరం చెప్పడం తగదు

## : సీఎం చంద్రబాబు

**2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని వెల్లడి**

**ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం**

**ఆరోగ్య సేవల మెరుగుకు సంజీవని.. ఫిబ్రవరి 16న రాష్ట్రానికి బిల్ గేట్స్**

**విశాఖకు గూగుల్, టీసీఎస్.. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ భారీ రిఫైనరీ**



**ఫిబ్రవరి 13ప్రజావినికిడి,**

పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడం సమర్థనీయం కాదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఏటా 3,500 టీఎంసీల గోదావరి వరద నీరు సముద్రంలోకి వృథాగా పోతోందని, అందులోంచి 200 టీఎంసీల నీటిని నల్లమలసాగర్‌కు తరలించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. తెలుగు రాష్ట్రాలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఈ ప్రాజెక్టుకు అడ్డుపడటం సరైన పద్ధతి కాదని హితవు పలికారు.

2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులను పూర్తిచేస్తామని, పోలవరాన్ని వంశధారతో అనుసంధానిస్తామని హామీ ఇచ్చారు. గడిచిన 20 నెలల్లో తమ సంకీర్ణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో గణనీయమైన ప్రగతి సాధించిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని వివరించారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల ఎదురైన ఇబ్బందులను అధిగమించిన తీరును, అభివృద్ధిని అడ్డుకోవడానికి జరుగుతున్న కుట్రలను సభలో ప్రస్తావించారు.

రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా పనిచేస్తున్నాయని సీఎం తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ముందుందని, గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు విశాఖకు వస్తున్నాయని చెప్పారు. అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, రామాయపట్నం వద్ద రూ.70,000 కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని కచ్చితంగా నెరవేరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ప్రజారోగ్య సేవలను మెరుగుపరిచేందుకు 'సంజీవని' ప్రాజెక్టును తీసుకొస్తున్నామని, ఇందులో భాగంగా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తామని తెలిపారు. ఈ నెల 16న బిల్ గేట్స్ రాష్ట్ర పర్యటనకు రానున్నారని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# మెరుగైన ఫలితాలు సాధించాం

(మొదటి పేజి తరువాయి)

ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అధికార పార్టీ ఎన్ని రకాలుగా బెదిరింపులు, దాడులు, ప్రలోభాలకు గురిచేసిందనీ, ప్రజల మనసు గెలవడంలో విఫలమైందని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో నాలుగు వేలకుపైగా సర్పంచ్ స్థానాలను బీఆర్ఎస్ గెలిచిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 15 మున్సిపాల్టీలను గెలిచిందని వివరించారు. హంగ్ వచ్చిన వాటిలో 10, 15 మున్సిపాల్టీల్లో తమకు అవకాశముందని చెప్పారు. రాష్ట్రంలో డబ్బు, మద్యం, అధికార యంత్రాంగ దుర్వినియోగం పరాకాష్టకు చేరాయని అన్నారు. అయినా ఓటర్లు భయపడకుండా బీఆర్ఎస్‌కు ఓటు వేశారని చెప్పారు.

కాంగ్రెస్ బేరసారాలు, ఎత్తుకుపోవడాలు, పోలీసులను పంపించి బెదిరించడాలు మొదలయ్యాయని అన్నారు. సింగరేణి బొగ్గు కుంభకోణం రూ.ఆరు వేల కోట్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బామ్మర్ది సృజన్‌రెడ్డి కీలక సూత్రధారిగా ఉన్నారని ఆరోపించారు. క్యాతనపల్లి మున్సిపాల్టీలో సీపీఐ తమకు మద్దతిచ్చిందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో తాను మాట్లాడాననీ, కొత్తగూడెంలో హంగ్ వచ్చిందనీ, తాము మద్దతిస్తామని హామీ ఇచ్చానని వివరించారు. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలు, అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే ఆ పార్టీతో కలిసి పనిచేస్తామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీని ఎండగడతామనీ, వాటిని నిరోధించడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. బీఆర్ఎస్‌కు మంచి భవిష్యత్తు ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని చెప్పారు. కాంగ్రెస్‌ను గద్దెదించే శక్తి, బీజేపీని నిరోధించే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని అన్నారు.

హైదరాబాద్ కార్పొరేషన్‌గానీ, మిగతా వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లు గానీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు గానీ ఇదే ఉత్సాహంతో ముందుకు పోతామని చెప్పారు. తానే రాజు తానే మంత్రి అనుకున్న వాళ్లను ఎంతో మందిని చూశామని అన్నారు. పిచ్చి తుగ్లక్‌లు చాలా మంది ఉంటారనీ, అలాంటి వారు వస్తుంటారు, పోతుంటారనీ, ఎవరూ శాశ్వతం కాదన్నారు. ఈ దేశం చాలా గొప్పదనీ, ప్రజల చైతన్యాన్ని ఎవరైనా తక్కువ అంచనా వేయొద్దని కోరారు. రేవంత్‌రెడ్డికి పాలన మీద నమ్మకముంటే పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కెపి వివేకానంద, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు రాకేశ్, బాలరాజు యాదవ్, బొమ్మెర రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

# 'పట్టణం' హస్తానిదే

(మొదటి పేజి తరువాయి)

. వాటిలో తుది వార్తలు అందే సమయానికి కాంగ్రెస్ పార్టీ 1,533 వార్డుల్లో గెలుపొందింది.బీఆర్ఎస్ 775, బీజేపీ 330, ఇతరులు 173, ఎంఐఎం 70 వార్డుల్లో విజయం సాధించాయి. సీపీఐ 35, సీపీఐ(ఎం) 13 వార్డులు గెలిచాయి. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలు పార్టీ రహితంగా జరిగినప్పటికి ఆ పార్టీ బలపర్చిన వారే మూడింట రెండోంతుల మంది జయ కేతనం ఎగుర వేశారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ సర్పంచ్ ఫలితాలే పునరావృతం అయ్యాయి. రామగుండం కార్పొరేషన్‌లో మొత్తం 60 వార్డుల్లో 30, మంచిర్యాలలో 60 డివిజన్లలో 46, నల్లగొండలో 48 వార్డుల్లో 27 స్థానాల్ని కాంగ్రెస్‌పార్టీ కైవసం చేసుకుంది. మహబూబ్ నగర్‌లో మొత్తం 60 స్థానాల్లో కడపటి వార్తలందే సరికి 43 స్థానాలకు ఫలితాలు వెల్లడయ్యాయి. అందులో కాంగ్రెస్‌కు 24స్థానాలు దక్కాయి. నిజామాబాద్, కరీం నగర్‌లలో బీజేపీ మెజార్టీ స్థానాలను దక్కించుకున్నా మేజిక్ ఫిగర్‌ను అందుకోలేకపోవడం తో ఇక్కడ మేయర్ ఎన్నిక రసవత్తరంగా మారనుంది.ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల అభ్యర్థుల మద్దతు కోసం ఆ పార్టీ పావులు కదుపుతోంది. కొత్తగూడెంలో ఒంటరిగా పోటీ చేసిన సీపీఐ మెజార్టీ స్థానాలను దక్కించుకుంది. మొత్తం 60 స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐ చెరో 22 డివిజన్లలో విజయం సాధించారు. ఇక్కడ బీఆర్ఎస్ 8 స్థానాలను గెలిచి, సీపీఐకి మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించింది. దీనితో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ సీపీఐ వశం అయ్యింది. కాంగ్రెస్‌పార్టీ నేరేడుచర్ల, హుజూర్‌నగర్, హాలియా, కోదాడ, నందికొండ, చండూరు, చిట్యాల, భూత్పూర్, ధర్మపురి, భీంగల్, బిచ్కుంద, బాన్సువాడ, ఎల్లారెడ్డి, చొప్పదండి, సుల్తానాబాద్, చెన్నూరు, మంథని, హుస్నాబాద్, మరిపెడ, డోర్నకల్, నారాయణఖేడ్, సంగారెడ్డి, ఆందోలు-జోగిపేట, సదాశివపేట, రామాయంపేట, హుజూరాబాద్, కొల్లాపూర్, కల్వకుర్తి, మద్దూరు, పెబ్బేరు, స్టేషన్‌ఘన్‌పూర్, మధిర, అశ్వారావుపేట, ఇల్లెందు, ములుగు, యాదిగిరిగుట్ట, ఆలేరు మున్సిపాల్టీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించింది.గడ్డపోతారం, ఇంద్రేశం, అయిజ, తొర్రూర్, ఇబ్రహీంపట్నం, తిరుమలగిరి, ఆమన్‌గల్, సిరిసిల్ల సహ మొత్తం 14 మున్సిపాల్టీలను బీఆర్ఎస్ వశం చేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాల్టీలో ఫార్వర్డ్ బ్లాక్ మెజార్టీ స్థానాలను దక్కించుకుంది. దేవరకద్ర, అలంపూర్, దేవరకొండ, ఆలియాబాద్, కోహీర్, కేసముద్రం, ఆసిఫాబాద్, అమరచింత, గద్వాల, క్యాతనపల్లి, జనగామ, జిన్నారం, నర్సాపూర్, జమ్మికుంట, వేములవాడ, రాయికల్, జహీరాబాద్, బెల్లంపల్లిల్లో ఏపార్టీకి స్పష్టమై మెజార్టీ రాలేదు. ఇండిపెండెంట్లు ఇతర పార్టీల అభ్యర్థుల మద్దతుపై ఇక్కడ ఎవరికి అధికారం దక్కనుందో ఈ నెల 13న తేలనుంది.

**క్యాంపులు నడిపితే చర్యలు : ఎస్ఈసీ**

క్యాంప్ రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. నిఘా, తనిఖీ బృందాలను మరింత అప్రమత్తం చేయాలని సూచించింది. ఈనెల 16న ఛైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని ఎస్ఈసీ స్పష్టం చేసింది. ఎన్నిక ధ్రువపత్రం స్వయంగా విజేతలకే అందచేయాలని తెలిపింది. ఎన్నికల కోడ్‌కు కట్టుబడి ఉంటామని విజేతలు డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశించింది. బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమల్లో ఉంటుందనీ, ముగ్గురికి మించి గుంపుగా ఉండరాదని పేర్కొంది.ముందస్తు అనుమతి లేకుండా ఎన్నికల కోడ్ ఉల్లంఘించేలా ప్రయివేట్, టూరిస్ట్ బస్సులు, ఇతర వాహనాల్లో వెళ్లవద్దని పేర్కొంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన విజేతలు, పార్టీలకు వెంటనే నోటీసు ఇవ్వాలని జిల్లా అధికారులను ఎస్ఈసీ ఆదేశించింది. కోడ్ ఉల్లంఘిస్తే డిక్లరేషన్, ఎన్నికల నిబంధనల మేరకు విజేతలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆయా జిల్లాల్లో జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది.

**త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు**

సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు దక్కించుకుని జోష్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలని భావిస్తోంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సైతం దీనికి సానుకూలంగా ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే రిజర్వేషన్ల డ్రాఫ్ట్ లిస్ట్‌ను ప్రభుత్వానికి, సీఎంకు అధికారులు అందించారు. రెండు విడతలుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తే మార్చి మొదటి వారంలో షెడ్యూల్ విడుదల చేసే అవకావం ఉందని తెలుస్తోంది.

# ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

న్యూఢిల్లీ **ఫిబ్రవరి 13ప్రజావినికిడి,**

మోడీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాలను, భద్రతను తాకట్టు పెట్టిందని ప్రతిపక్షాలు నిరసనలు వ్యక్తం చేసిన తొలి దశ బడ్జెట్ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం, కేంద్ర బడ్జెట్‌పై చర్చ ఉభయ సభల్లో జరిగింది. ఈ రెండు అంశాలపై చర్చల సందర్భంగా ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు నిలదీశాయి. లోక్‌సభలో ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్ బిల్లు ఆమోదం పొందింది.

మార్చి 9న ప్రారంభ కానున్న రెండో దశ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. శుక్రవారంనాడు ప్రతిపక్షాలు పార్లమెంటు లోపల, వెలుపల ఆందోళన చేపట్టాయి. ఇండియా-అమెరికా వాణిజ్య ఒప్పందంలోని రహస్యాలను తొలగించడం, ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవాణే పుస్తకంలోని వివాదాస్పద భాగాలను చర్చించడం, తీవ్ర సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైళ్లలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల పేర్లు ప్రస్తావనకు రావడం వంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తాయి.రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా తన ప్రసంగంలో ఎక్కువ భాగాన్ని రికార్డు నుంచి తొలగించాలనే చర్యను రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే వ్యతిరేకించారు. రాజ్యసభ ఛైర్మెన్ సి.పి రాధాకృష్ణన్ ఈ చర్యను ఉపసంహరించుకోవాలన్న ఖర్గే డిమాండ్‌ను తిరస్కరించారు.

ప్రతిపక్షాల తీవ్ర ఆందోళనలు

శుక్రవారం లోక్‌సభ సమావేశమైనప్పుడు, ప్రతిపక్ష సభ్యులు తీవ్ర ఆందోళనలు చేపట్టారు. సభ్యులు హోరెత్తిన నినాదాలతో వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ ఓంబిర్లాకు బదులుగా సభను నిర్వహించిన సంధ్యారే, ప్రతిపక్షాలను శాంతించాలని పదేపదే కోరారు. కానీ ఫలితం లేకపోయింది. దీని తరువాత, సభ కార్యకలాపాలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు, కేంద్రమంత్రులు తమ విభాగాలకు సంబంధించిన పత్రాలను సమర్పించారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్టు సంధ్యారే ప్రకటించారు. జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయం తర్వాత, రాజ్యసభ కూడా మార్చి 9 వరకు వాయిదా పడింది.

'రాహుల్ సభ్యత్వ రద్దు తీర్మానంపై ఆ తరువాతే నిర్ణయం'

రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ సభ్యుడు దాఖలు చేసిన నోటీసుపై స్పీకర్‌ను సంప్రదించిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. మొదట్లో హక్కుల ఉల్లంఘన కింద రాహుల్‌పై నోటీసు జారీ చేయాలని అనుకున్నారు. ఈ సందర్భంగానే బీజేపీ సభ్యుడు నిషికాంత్ దూబే రాహుల్‌పై ఒక ముఖ్యమైన తీర్మాన నోటీసు ఇచ్చారు. స్పీకర్‌తో సంప్రదించి ఈ విషయాన్ని హౌస్ ప్రివిలేజెస్ కమిటీకి లేదా ఎథిక్స్ కమిటీకి సూచించాలా లేదా నేరుగా లోక్‌సభకు తీసుకురావాలా వద్దా అని నిర్ణయం తీసుకుంటానని కిరణ్ రిజిజు మీడియాకు తెలిపారు.

'కేంద్రమంత్రి హర్దీప్ సింగ్‌ను తొలగించాలి'

బడ్జెట్ సమావేశాల మొదటి, రెండో దశల మధ్య మూడు వారాల విరామం ఉంది. ఈ విరామ సమయంలో, పార్లమెంటరీ కమిటీలు వివిధ విభాగాలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులను పరిశీలిస్తాయి. ఇండియా-అమెరికా 'ట్రాప్ డీల్'ను రద్దు చేయాలని, ప్రసిద్ధ బాలల వేధింపుల నేరస్థుడు ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్నాయని బహిరంగంగా అంగీకరించిన కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు పార్లమెంటు వెలుపల నిరసన తెలిపాయి.

# ఊకూకనే రాలే బిడ్డ కూసున్న సీటూ..

## షాద్ నగర్ పై "శంకర్ మార్క్"



**బిఆర్ఎస్ గులాబీ కోటను బద్దలు కొట్టిన కాంగ్రెస్..**

**2 సీట్లకు పరిమితమైన మున్సిపాలిటీని 15 సీట్లకు పెంచి..**

**షాద్ నగర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసంతో సరికొత్త రాజకీయం..**

**శంకరుడి చాణిక్య నీతి పై పార్టీ వర్గాల హర్షం..**

**మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి..**

**శ్యామ్ సుందర్ రెడ్డి తదితర సీనియర్ నాయకుల సమన్వయం..**

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
ఎవరు అవునన్నా కాదన్నా గెలుపు కాంగ్రెస్ దే..ఎలా గెలిచినా ఏదైనా విజయం విజయమే.. మున్సిపాలిటీ పాలకవర్గాన్ని చేజిక్కించుకోవడం అంటేనే కాంగ్రెస్ కు గొప్ప విజయం. పోగొట్టుకున్న చోటనే వెతకాలి పట్టాలి..ఇందులో ఎలాంటి శషబిశలు అవసరం లేదు. రామాయణంలో పిడకల వేటలా కొందరు కాంగ్రెస్ గెలుపు పై బీరాలు పలుకుతున్న తీరు కూడా చర్చకు వస్తుంది.
షాద్ నగర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాటలు హామీలు నేడు నిజమయ్యాయి. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించినప్పుడే గొప్ప రాజకీయ నాయకులు అవుతారు. కారణాలు ఏవైనా కాంగ్రెస్ అనుకున్నది నెరవేర్చుకుంది. గత 9 ఏళ్లు బిఆర్ఎస్ ప్రభుత్వం పాలించిన వేళ కాంగ్రెస్ పార్టీ పాలకవర్గం అతలాకుతలం అయింది.అప్పట్లో మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం ఉన్నఫలంగా బిఆర్ఎస్ పార్టీలో చేరాక ఆనాడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రెండు అంటే రెండే కౌన్సిలర్ స్థానాలు వచ్చాయి. ఇప్పుడు అధికారం చేపట్టిన తర్వాత 15 స్థానాలను నేడు బిఆర్ఎస్ పార్టీ నుండి తీసుకోవడం మున్సిపల్ పీఠాన్ని చేజేక్కించుకోవడం అంత ఆషామాషీ కాదు.బిఆర్ఎస్ పార్టీ బలహీనంగా లేదని ఇక్కడ గమనించాల్సిన అంశం. ఆషామాషీగా ఈ స్థానాన్ని అంత ఈజీగా బిఆర్ఎస్ పార్టీ వదులుకోవడానికి సిద్ధంగా లేదు. దెబ్బతిన పులి బిఆర్ఎస్ అని మరవద్దు. అధికారం ఉన్న సమయంలో జాగ్రత్తగా పావులు కదిపి ఒక చాణక్య నీతిని అవలంబించి అనుకున్న గమ్యాన్ని చేరుకోవాల్సిన అవసరం ఉంది. గెలిచాక ఆ గెలుపు పై రామాయణంలో పిడకల వేటలా లోటుపాట్లు వెతకడం కొందరికి సాధారణమే.కానీ ఆ విజయానికి వెనుక ఉన్న ఇబ్బందుల స్థితిగతులను కూడా పరిశీలించుకోవాలి.

అన్ని సామాజిక వర్గాలకు న్యాయం..
షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభ్యర్థుల ఎంపిక తీరు స్థానిక ప్రజల మన్ననలు పొందుతుంది. బడుగు బలహీన వర్గాలు ఎస్సీ ఎస్టీ మైనార్టీ ప్రజల రాజకీయ చైతన్యం అభివృద్ధిపై దృష్టి సారించి సీట్లను కేటాయించడం విశేషంగా చెప్పవచ్చు. సమాజంలో చిన్న కులవృత్తులు చేసుకుని ఆరెకటిక, రజక, ముస్లిం మైనార్టీలు, ఓసి బీసీలను మిలితం చేసి అన్ని వర్గాలకు ఈరోజు కొత్తవారిని అందులో యువతను పెద్ద ఎత్తున ప్రోత్సహించిన ఘనత కూడా ఎమ్మెల్యేదే.. సామాజిక వర్గాల
కూర్పు చక్కగా చేసి వారిని మున్సిపల్ కౌన్సిల్ కు ఎంపిక చేసిన తీరు,ప్రచార హోరు సర్వత్ర ప్రశంసనీయమే. ఇక్కడ మరో విషయం ముఖ్యంగా చెప్పుకోవాలి.
బిఆర్ఎస్ పని అయిపోయిందని భావిస్తే తప్పే.. ఎందుకంటే బీఆర్ఎస్ ను ఎప్పుడు తక్కువ అంచనా వేయొద్దు. ఇంతకుముందు చర్చించుకున్నట్టు దెబ్బతిన్న పులి బీఆర్ఎస్.తన ఉనికిని ఎప్పుడు కోల్పోకుండా కాపాడుకునే ప్రయత్నం చేస్తుంది అందుకే రాజకీయ ఎత్తుగడలతో కుర్చీలు సాధించడం తెలివిగా ఓర్పుగా నేర్పుగా ముందుకు సాగడం కాంగ్రెస్ పార్టీకి సవాలుగా మిగిలింది.ఆ సవాళ్లను స్వీకరించి ముందుకు సాగి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన "మార్క్" ప్రదర్శించి మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించారు. బిఆర్ఎస్ పార్టీకి రెండు సీట్లు ఎక్కువ వచ్చిన, కాంగ్రెస్ పార్టీకి రెండు సీట్లు తక్కువగా వచ్చినా రాజకీయంగా ఏం జరగాలో అదే జరుగుతుంది. రెండు సీట్లు తక్కువ వచ్చాయని మున్సిపల్ పీఠం ఎక్కడం ఆపేయలేదు కదా..? అలా జరిగేది ఇలా జరిగేది అంటూ రామాయణంలో పిడకల వేటలా ఎత్తిపొడుపులు సమంజసము కాదనీ ఆలోచించుకోవాలి అంటున్నారు కాంగ్రెస్ నాయకులు.ఒక్క ఓటుతో గెలిచిన ఒక్క ఓటుతో ఓడిపోయిన గెలుపు గెలుపే ఓటమి ఓటమే అని గ్రహించాలి. బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ పీఠాన్ని లాగిందా లేదా చూడాలి..? గెలుపును వరించిందా లేదా చూడాలి.తప్పు ఒప్పులు అందరూ చేస్తారు.ప్రతి ఓటమి నుండి ఒక గుణపాఠం నేర్చుకోవాలి.

విజయంగా ముందుకు సాగాలి.ఇక్కడ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పార్టీ నాయకులతో సమిష్టి కృషి చేశారు.తన సొంత మార్క్ రాజకీయాలతో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి సూచన సలహాలతో శ్యాంసుందర్ రెడ్డి మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ తాండ్ర విశాల జడ్పిటిసి వెంకటరామిరెడ్డి బాలరాజ్ గౌడ్ చల్లా శ్రీకాంత్ రెడ్డి, కృష్ణారెడ్డి కేకే కృష్ణ ఇంకా ఎందరో నేతల ఎత్తులు పై ఎత్తులు వారి సహకారం తదితర అంశాలు కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చాయి.ఈ విషయాన్ని ఎవరైనా కాదంటారా..?

### కాంగ్రెస్ పార్టీది విజయం అంతా ఈజీ కాదు..

కాంగ్రెస్ పార్టీకి విజయం అంత ఈజీగా లభించలేదు. ఏమాత్రం పొరపాటు చేసినా పీఠం చేజారేది. అనేక ప్రణాళికలు ఎత్తుగడలు రచించి ఏదో రకంగా 15 సీట్లను సాధించింది. అధికారం చేతిలో ఉన్నప్పటికీ ప్రజలను మెప్పించి ఒప్పించి ఓట్లు రప్పించుకోవడం అంత ఆషామాషీ విషయం కాదు. డబ్బే ప్రధానం అయితే అది అధికార,ప్రతిపక్ష పార్టీల వద్ద చాలా ఉంది,డబ్బులు వెదజలితే 28 సీట్లు కూడా క్లీన్ స్విఫ్ చేయాలి. అలాగని కాంగ్రెస్ పార్టీ,బిఆర్ఎస్ పార్టీ రెండు బరితెగించలేదు కదా..? కానీ ఎవరి విధానాలు ఎవరి ఎవరి ఎత్తుగడలు వారివి.

### ఎస్..ఎవరి ప్రయత్నాలు వారివి

ఎస్..ఎవరి ప్రయత్నాలు వారివి. అధికారంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ హేమాహేమీలను ఎన్నికల్లో పిలుచుకొని వారితో ప్రచారం చేయించుకుంది. మంత్రి దామోదర్ రాజనర్సింహ మొదలు మరింత మంది పార్టీ నాయకులు ప్రచారం చేశారు. మంత్రి ఇతర ముఖ్య నాయకులు ప్రచారం చేసిన వార్డులో సుమారు 400 దాకా మెజార్టీ కూడా వచ్చిందన్న విషయం మర్చిపోకూడదు.
గెలిచామా లేదా? అన్నదే ఇంపార్టెంట్.అదే బిజెపి విషయంలో కూడా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రచారానికి వచ్చి 9వ వార్డులో అశోక్ ను గెలిపించుకోగలిగారు.ఎవరి ఇష్టం వారిది.బిఆర్ఎస్




పార్టీ టికెట్ ఇవ్వకపోతే రెబల్గా స్వతంత్ర బరిలో నిలబడి 8 వ వార్డు అభ్యర్థి సుధీర్ విజయ విహారం చేశారు.ఇక్కడ ఎవరిని ఎక్కువ తక్కువ చేసి మాట్లాడలేం. మున్సిపల్ ఎన్నికల్లో ఎక్కడ కనిపించని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తెరవెనుక తనను నమ్ముకున్న వారిని కొందరిని గెలిపించుకున్నాడనీ ఇప్పుడు ప్రచారం జరుగుతుంది.ఇది అక్రమమా సక్రమమా? పక్కన పెడితే తన వారికోసం తాను కష్టపడడం తప్పులేదు. ఎన్నికలు అన్నప్పుడు ఎవరి ఎత్తుగడలు వారివి.గెలుపే ప్రధానం కావాలి. ఇక డబ్బుల పంపిణీ విషయానికి వస్తే ఎవరు సొక్కం సోలలు కాదు. అందరు ఓటర్లకు అన్ని పంచి పెట్టారు.దేశం కోసం ధర్మం కోసం అనే కాన్సెప్ట్ ఉన్నోళ్ళు కూడా మందులు చీరలు డబ్బులు పంచిన దాఖలాలు ఉన్నాయి మరి. ఎవరేం తక్కువ కాదు.ఏ పార్టీ ఏ నాయకుడు ఏం చేసినా తన మనుగడ కోసమే అన్న విషయం మర్చిపోవద్దు.

### ఇక అసలు విషయానికి వస్తే..

నియోజకవర్గంలో తుడిచిపెట్టుకుపోయిన కాంగ్రెస్ పార్టీని మళ్లీ బ్రతికించేందుకు నడుము కట్టిన వీర్లపల్లి శంకర్.. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల్లో బలంగా పార్టీని నిలిపిన అంజయ్య యాదవ్ ను ఓడించడం అంతా ఆషామాషీ కాదు. కానీ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తనకున్న రాజకీయ పరిజ్ఞానం తన మార్క్ రాజకీయాలతో ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ వచ్చాడు.ఊరికేనే ఎమ్మెల్యే సీటు తమాషాకు ఎక్కలేదు.దాని వెనుక ఎంతో కష్టం దాగి ఉంది. పార్టీలో ఎవరూ లేని సమయంలో ఎంతో చాతుర్యంతో తిరిగి సొంతగూటికి అందరిని రప్పించాడు. అంతేకాదు పక్క పార్టీ వాళ్ళను కూడా తన పార్టీలోకి తెచ్చుకున్నాడు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, భీష్మ కిష్టయ్య, అదేవిధంగా శివశంకర్ గౌడ్, ఇతర పార్టీ నుండి మాజీ జెడ్పిటిసి వెంకటరామిరెడ్డి, తాండ్ర విశాల రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి లాంటి హేమాహేమీలను ఎమ్మెల్యే శంకర్ తన పంచన చేర్చుకున్నారు. ఇది ఊరికే జరగలేదు.ఎంతో పరిజ్ఞానంతో భవిష్యత్తు రాజకీయాన్ని దృష్టిలో పెట్టుకుని చేసుకున్న ఒక ప్రణాళిక.కాంగ్రెస్ పార్టీకి లాభం జరిగిందా నష్టం జరిగిందా అంటే 100% లాభం జరిగిందని చెప్పాలి. బిఆర్ఎస్ మున్సిపల్ స్థానాన్ని కాంగ్రెస్ చేజెక్కించుకోవడం ఒక లక్ష్యం.అది తక్కువ సీట్లా? ఎక్కువ సీట్లా ? అన్న ప్రశ్న కాదు కచ్చితంగా తను కావలసిన మెజార్టీ సీట్లను మాత్రం ఎవరిపై ఆధారపడకుండా సాధించుకోగలిగింది.మ్యాజిక్ ఫిగర్ ను అందుకుంది. హంగ్ రాలేదు.. కాదు కాదు రానివ్వలేదు.పీఠం అధిష్టించి పాలకవర్గాన్ని సిద్ధం చేయడానికి ఎవరిని చేయి చాచి మద్దతు అడగలేదు.ఇక ఇప్పుడు చెప్పండి శంకర్ మార్క్ రాజకీయం ఎలా పకడ్బందీగా సాగిందో అర్థం చేసుకోవాలి. ఊకూకనే రాలే బిడ్డ కూసున్న సీటూ.. ఎదురించుకుంటు ఎక్కినరా ఒక్కొక్క మెట్టు..పాట కాంగ్రెస్ అధినేత సీఎం రేవంత్ రెడ్డి అందుకే కాంగ్రెస్ పార్టీకి అంకితం చేశారు అని గమనించక తప్పదు..





ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# తిరిగింది శంకర చక్రం.. గెలిచింది అభయ హస్తం..



**షాద్ నగర్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ దే..**
**15 స్థానాల్లో సత్తా చాటిన కాంగ్రెస్..**
**ఫలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యూహాలు..**
**బీఆర్ఎస్ నుంచి గట్టి పోటీని తట్టుకొని విజయం..**
**11 స్థానాల్లో బీఆర్ఎస్ హవా..**
**మున్సిపల్ పీఠంలో ఖాతా తెరిచిన బిజెపి..**
**బీఆర్ఎస్ కు రెబల్ అభ్యర్థి సుధీర్ షాక్..**



**ప్రజావినికిడి, (షాద్ నగర్):**
మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియ మొత్తానికి పూర్తయింది..15 స్థానాల్లో సత్తా చాటి కాంగ్రెస్ మున్సిపల్ పీఠాన్ని సొంతం చేసుకుంది. మరోవైపు బీఆర్ ఎస్ కూడా గట్టి పోటీ ఇచ్చి మున్సిపాలిటీలో తన ఆధిపత్యాన్ని చాటుకుంది. బిజెపి గత మూడు ఎన్నికల్లో మొదటిసారిగా ఖాతా తెరిచింది. బీఆర్ఎస్ టికెట్ ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థి గా పోటీ చేసి విజయం సాధించిన సుధీర్ ఆ పార్టీకి షాక్ ఇచ్చాడు. మొత్తంగా తన వ్యూహాలతో మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకొని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరోసారి తన సత్తా చాటాడు. ఒక్కసారి శుక్రవారం ఎన్నికల చిత్రాన్ని పరిశీలిస్తే..

**అలా మొదలైంది..**

భారీ కోలాహలం మధ్య శుక్రవారం ఎన్నికల ప్రక్రియ పట్టణంలోని మినీ స్టేడియంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. తొలి ఫలితమే కొంత గందరగోళాన్ని సృష్టించింది. ఒకటో వార్డులో మొదట ఒక అభ్యర్థి గెలిచినట్లుగా ప్రకటించి తర్వాత బీఆర్ఎస్ గెలుపును ఖాయం చేశారు.లెక్కింపు ఓట్లలో ఒక కట్టను మర్చిపోవడమే ఇందుకు కారణం. తప్పు తెలుసుకుని అధికారులు ఆ మిగతా వాటిని కూడా కౌంటింగ్ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి గౌస్ జాన్ గెలిచినట్లుగా ప్రకటించారు.ఇక బేసి సంఖ్య రూపంలో ముందుకు వెళ్లిన ఈ ఫలితాల్లో మూడవ వార్డు బీఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లిపోగా ఐదవ వార్డుతో కాంగ్రెస్ తన ఖాతా తెరిచింది. మధ్యాహ్నం కల్లా జరిగిన మొదటి విడత బేసి సంఖ్య ఫలితాల్లో 14 స్థానాల్లో కాంగ్రెస్ 8, టిఆర్ఎస్ బీఆర్ఎస్ 5, బిజెపి ఒక స్థానంతో నిలిచాయి.ఇక రెండో అంకం వచ్చేసరికి సరి సంఖ్యలో ఏడు స్థానాలు కాంగ్రెస్ వశం కాగా,ఆరు స్థానాలను బీఆర్ఎస్ చేజిక్కించుకుంది. మరో స్థానం స్వతంత్ర అభ్యర్థి వైపు వెళ్ళింది. గెలుపు పూర్తవడంతో బయట కార్యకర్తల కేరింపులు, వార్డుల్లో ఊరేగింపులతో సందడే సందడి నెలకొంది. మొత్తానికి నువ్వా..నేనా అన్న రీతిలో జరిగిన ఎన్నికల్లో కష్టపడ్డప్పటికీ కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని నిలుపుకోగలిగింది.



**వార్డుల వారీగా అభ్యర్థుల విజయాలు ఆధిపత్యం ఇలా ఉన్నాయి..**

ఒకటవ వార్డు
అభ్యర్థి గౌస్ జానీ
మెజారిటీ 313
పార్టీ బి ఆర్ ఎస్
రెండవ వార్డ్
అభ్యర్థి బచ్చలి నరేష్
మెజారిటీ 150
పార్టీ కాంగ్రెస్
మూడవ వార్డు
అభ్యర్థి అశోక్ యాదవ్
మెజారిటీ 546
పార్టీ బి ఆర్ ఎస్
నాలుగవ వార్డ్
అభ్యర్థి చల్లా వాణి
మెజారిటీ.. 323
పార్టీ.. బీఆర్ఎస్

ఐదవ వార్డ్
అభ్యర్థి సింగపాగ శిరీష
మెజారిటీ.. 31
పార్టీ కాంగ్రెస్
ఆరవ వార్డు
అభ్యర్థి రాజు నాయక్
మెజారిటీ..371
పార్టీ కాంగ్రెస్
ఏడవవార్డు
అభ్యర్థి కొప్పునూరు ప్రవీణ్ కుమార్..
మెజారిటీ 636
పార్టీ కాంగ్రెస్
ఎనిమిదవ వార్డు
అభ్యర్థి సుధీర్
మెజారిటీ 76
స్వతంత్ర అభ్యర్థి
9వ వార్డు
అభ్యర్థి ప్యాట అశోక్ కుమార్
మెజారిటీ..199
పార్టీ..బిజెపి
పదవ వార్డు
అభ్యర్థి..నడి కూడా శ్రావణి
మెజారిటీ..150
పార్టీ కాంగ్రెస్
11వ వార్డు
అభ్యర్థి పిల్లి శారద
మెజారిటీ 181
పార్టీ బి ఆర్ ఎస్
12వ వార్డు
అభ్యర్థి కలంకార్ దిలీప్ కుమార్
మెజారిటీ..114
పార్టీ కాంగ్రెస్
13వ వార్డు
అభ్యర్థి రిజ్వానా బేగం
మెజారిటీ..152
పార్టీ కాంగ్రెస్
14వ వార్డు
అభ్యర్థి అందె మోహన్
మెజారిటీ 767
పార్టీ కాంగ్రెస్
15వ వార్డు
అభ్యర్థి మరియంబేగం
మెజారిటీ 176
పార్టీ కాంగ్రెస్
16వ వార్డు
అభ్యర్థి ఒగ్గు విజయలక్ష్మి
మెజారిటీ 436
పార్టీ బి ఆర్ ఎస్
17వ వార్డు
అభ్యర్థి నజీయాబేగం
మెజారిటీ 217
పార్టీ కాంగ్రెస్
18వ వార్డు
అభ్యర్థి సంతోషి బాయి
మెజారిటీ.. 121
పార్టీ కాంగ్రెస్
19వ వార్డు
అభ్యర్థి ఆరిఫా బేగం
మెజారిటీ 230
పార్టీ బిఆర్ఎస్
20వ వార్డు
అభ్యర్థి పినమోని గోపాల్..
మెజారిటీ..288
పార్టీ బి ఆర్ ఎస్
21వ వార్డు
అభ్యర్థి జీటీ వసంత
మెజారిటీ 53
పార్టీ బిఆర్ఎస్
22వ వార్డు
అభ్యర్థి నడికుడ అనిత
మెజారిటీ 45
పార్టీ బి ఆర్ ఎస్
23వ వార్డు
అభ్యర్థి అగునూరు బసవేశ్వర్
మెజారిటీ 187
పార్టీ కాంగ్రెస్
24 వ వార్డు
అభ్యర్థి అగ్గునూరు విశాల
మెజారిటీ 42
పార్టీ కాంగ్రెస్
25 వ వార్డు
అభ్యర్థి సి. పెంటయ్య
మెజారిటీ..8
పార్టీ కాంగ్రెస్
26వ వార్డు
అభ్యర్థి బుర్ర శివ
మెజారిటీ 303
పార్టీ బి ఆర్ ఎస్
27వ వార్డు
అభ్యర్థి మురళీమోహన్ (అప్పి)
మెజారిటీ..103
పార్టీ కాంగ్రెస్
28వ వార్డు
అభ్యర్థి చేగూరు లక్ష్మీప్రసన్న
మెజారిటీ..496
పార్టీ బి ఆర్ ఎస్.

# ఘనంగా ముగిసిన ది గాడియం 6వ ఎడిషన్ తెలంగాణ స్టేట్ ఓపెన్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ -2026







**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
ది గాడియం 6వ ఎడిషన్ తెలంగాణ స్టేట్ ఓపెన్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ -2026 మంగళవారంతో ముగిసింది.7వ తేదీ నుండి10వ తేదీ వరకు జరిగిన ఈ టోర్నీలో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడెమీ క్రీడాకారిణులు నర్రా హర్షిణి,శాన్వి చెలూరి జంట అండర్ 11 గర్ల్స్ డబుల్స్ విభాగంలో అద్భుతమైన ఆటతో రజత పతకం గెలుచుకున్నారు. క్వార్టర్ ఫైనల్స్ లో గోపిచంద్ అకాడమీ క్రీడాకారిణులు హన్విత, స్పృహ కేల్కర్ జోడి మీద 15/04,15/02 స్కోర్ తో సెమి ఫైనల్ మ్యాచ్ లో నైట్ ట్రైన్ అకాడెమీ క్రీడాకారిణులు నిత్య పుల్లగుర, భవ్య జోడి మీద 15/07,15/04 స్కోర్ తో గెలిచి ఫైనల్స్ కి చేరుకున్నారు. ఫైనల్స్ లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు అధ్యా రెడ్డి,షీనా శ్రీ జోడి మీద చివరి వరకు పోరాడి 21/19 ,15/13 స్కోర్ తో టౌర్నమెంట్ రన్నర్స్ గా నిలిచారు.37 నిమిషాల పాటు నువ్వా నేనా అని సాగిన మ్యాచ్ లో చివరకు మ్యాచ్ పాయింట్ జోడి సిల్వర్ మెడల్ తో సరిపెట్టుకున్నారు. టైటిల్ ఫేవరేట్స్ గా టోర్నమెంట్ లో అడుగు పెట్టిన మ్యాచ్ పాయింట్ జోడి నర్రా హర్షిణి, శాన్వి చెలూరి అద్భుతమైన ఆటతో అలరించారు.ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ప్లేయర్,ఇండియా టాప్ సీడ్ ప్లేయర్ సాత్విక్ రెడ్డి సర్టిఫికెట్స్,ట్రోఫీ, క్యాష్ అవార్డు ప్రధానం చేశారు. దాదాపు 800 మంది క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ , కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుండి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మ్యాచ్ పాయింట్ ఫౌండర్,చైర్మన్ వేణు ముప్పాల మాట్లాడుతూ తమ అకాడెమీ కోచింగ్ సిబ్బంది ఎంతో క్రమశిక్షణతో శిక్షణ అందించారని రానున్న రోజుల్లో మ్యాచ్ పాయింట్ నుండి మరింత మంది క్రీడాకారులు సత్తా చాటడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.నర్రా హర్షిణి,శాన్వి చెలూరి లను అభినందించారు.

# సౌదీ జైల్లో మగ్గుతున్న వెంకటేష్ ను ఇండియాకు తీసుక రావాలి



**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):** ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లి సౌదీ జైల్లో మగ్గుతున్న కమటం వెంకటేష్ ను ఇండియాకు తీసుకువచ్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తడగొండ సత్యరాజ్ వర్మ కోరారు.శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకటేష్ తల్లి కమటం కాంతమ్మ, కాంగ్రెస్ నాయకులు రామచంద్రంతో కలిసి ఆయన మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన కమటం వెంకటేష్ కు సౌదీ అరేబియాలో ఉద్యోగం ఇప్పిస్తానని జగిత్యాల జిల్లా, కోడిమ్యాల మండలం, తిప్పయ్య పల్లికి చెందిన నకిలీ ఏజెంట్ తునికి శేఖర్ 3లక్షలు తీసుకొని సౌదీ అరేబియా తీసుకువెళ్లి మోసం చేశాడని వెంకటేష్ తల్లి కాంతమ్మ కన్నీటి పర్యంతమయ్యారు.రాత్రి వేళలో మద్యం దందాలో సౌదీ నుండి దాదాపు 500 కిలోమీటర్ల దూరం వెంకటేష్ ను వదిలిపెట్టగా అక్కడి పోలీసులు దాడి చేసి అరెస్టు చేయడంతో ప్రస్తుతం సౌదీ జైల్లో ఖైదీ జీవితం గడుపుతున్నారని వారు ఆరోపించారు.ఈ విషయంపై ప్రజాదర్బార్ లో వెంకటేష్ తల్లి కాంతమ్మ ఫిర్యాదు చేయడంతో ఇంచార్జ్ డాక్టర్ జి చిన్నారెడ్డి సౌదీ అరేబియా ఎంబాసికి లేఖ రాయాలంటూ ఆదేశించగా ముఖ్యమంత్రి కార్యదర్శి శేషాద్రి ఎంబాసికి లేఖ రాయడం జరిగిందని చెప్పారు.ఉద్యోగం కోసం వచ్చిన వెంకటేష్ ను నమ్మించి మోసం చేసిన ఏజెంట్ శేఖర్ ముదిరాజ్ పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య ను కలిసి విన్నవించగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీకి కమిషన్ లేక ఇవ్వడంతో స్పందించిన ఎస్పీ ఏజెంట్ తునికి శేఖర్ అతనికి సహకరించిన వారిపై స్థానిక పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందని చెప్పారు.ఉపాధి కోసం వెళ్లి సౌదీ అరేబియా జైల్లో జైలు జీవితం గడుపుతున్న వెంకటేష్ ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకొని జైలు నుంచి విడిపించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సంఘం నాయకులు మడిపల్లి లక్ష్మి ఏటగిరి లక్ష్మి పారునంది బాబు సురుగునాంపల్లి తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్లు నిరంతరం ప్రజల్లో ఉండి పనిచేయండి

## షాద్ నగర్ మీడియాతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
ప్రజల సహృదయంతో కాంగ్రెస్ పార్టీకి ఓటు ఇచ్చి ప్రగతికి చోటు కల్పించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల అనంతరం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికలు పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా జరిగాయని అన్నారు. ఎన్నికలను ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించిన పోలీసులకు, అధికారులకు, మీడియా ప్రతినిధులకు ఆయన అభినందనలు తెలిపారు.ఈ ఎన్నికల్లో బడుగు వర్గాలను దృష్టిలో పెట్టుకొని అందరికీ అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఒక రజకుడు,ఒక ఆర్య కటిక నాయకులు,ఎస్సీ, ఎస్టీ,మైనార్టీలు తదితరులకు అవకాశం కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. మైనారిటీలకు కూడా పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇచ్చామని, వారందరూ విజయం సాధించడం సంతోషకరంగా ఉందని



పేర్కొన్నారు.గత రెండేళ్లలో వార్డుల వారీగా చేసిన అభివృద్ధి పనులే పార్టీని గెలిపించాయని అన్నారు. భవిష్యత్తులోనూ పార్టీలకు సంబంధం లేకుండా అన్ని వార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఓడిపోయిన అభ్యర్థులు నిరాశకు గురికావాల్సిన అవసరం లేదని, మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని, పదవుల్లో లేకున్నా ప్రజల్లో ఉండాలని పేర్కొన్నారు.ఈ ఎన్నికల ప్రక్రియలో తనకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.చైర్మన్ పదవిపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంతోమంది యువతకు అవకాశాలు కల్పించామని పార్టీ కూడా యువత వైపు దృష్టిసారించిందని అదేవిధంగా చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎంపిక అధిష్టానం చూసుకుంటుందని న్యాయంగా పనిచేసిన వారు పార్టీకి అన్ని వేళల్లో కష్టపడ్డ వారికి గుర్తింపు ఉంటుందని చైర్మన్ ఎంపికలు పార్టీ నిర్ణయం కార్యకర్తల అభిప్రాయం సీనియర్ నాయకులు తదితరు కమిటీ సభ్యుల పరిధిలో ఉంటుందని అందరి అభిప్రాయాలను తను గౌరవిస్తానని ఎమ్మెల్యే శంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

# వైభవంగా శివపార్వతుల కళ్యాణం



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో గల శ్రీ గిరిజ అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఆలయ ధర్మకర్త కే.ఎం. పరమేశ్వర్..స్వప్న దంపతుల నేతృత్వంలో పల్లకి సేవ,ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో విష్ణుమూర్తి, గంగిరెడ్డి,దుగ్గ శేఖర్,నవనీత్, చారి,శివకుమార్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ది...

### ఎమ్మెల్యే సుథీర్ రెడ్డి సుదీర్ రెడ్డి.



బాధితుడు రవికుమార్ కు ఒక లక్ష రూపాయల ఎల్.ఓ.సీ.అందజేస్తున్న ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి..

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గుంటి జంగయ్య నగర్ నందు నివాసం ఉండే రవికుమార్ భుజం నొప్పికి సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి ని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది.దానికి గాను వారికి 1,00,000(ఒక లక్ష రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## కోదాడ గడ్డ పద్మక్క అడ్డా..

### - ముస్కు శ్రీనివాస్ రెడ్డి



**అనంతగిరి: ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** కోదాడ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిందని అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు శ్రీనివాసరెడ్డి తెలిపారు. అభివృద్ధి, నమ్మకం, పారదర్శక పాలనకు మద్దతుగా కోదాడ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చి కాంగ్రెస్ అభ్యర్థులను విజయపథంలో నిలబెట్టారని పేర్కొన్నారు. ఈ విజయం కేవలం పార్టీదే కాకుండా ప్రజాస్వామ్య చైతన్యానికి నిదర్శనమని అన్నారు.ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు విమర్శలు, అపోహలు సృష్టించేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రజలు వాటిని నమ్మలేదని, నోటితో కాదుడ తమ అమూల్యమైన ఓటుతో సమాధానం ఇచ్చారని వ్యాఖ్యానించారు.మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వం, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి నాయకత్వం, పార్టీ శ్రేణుల కృషి ఫలితంగానే ఈ విజయాన్ని సాధించగలిగామని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా కోదాడను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడం వారి ప్రధాన లక్ష్యమని చెప్పారు.

## చిట్యాలలో ట్రాన్స్‌జెండర్ శ్వేత సుధాకర్ విజయం



నల్లగొండ, **ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** రాష్ట్రంలో రెండు కార్పోరేషన్‌లు, 116 మున్సిపాలిటీలకు ఇటీవల పోలింగ్ జరిగింది. ఇవాళ కౌంటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. నల్గొండ జిల్లాలోని చిట్యాల మున్సిపాలిటీలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన ఓ ట్రాన్స్‌జెండర్ విజయం సాధించారు. ట్రాన్స్‌జెండర్ శ్వేత సుధాకర్ చిట్యాల మున్సిపాలిటీలోని 1వ వార్డు నుంచి బరిలో దిగారు. ఎన్నికల ప్రచారంలో శ్వేత సుధాకర్ వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ అభివృద్ధి లక్ష్యంగా సుధాకర్ ఇచ్చిన హామీలు ఓటర్లను ఆకట్టుకున్నాయి. దాంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను కాదని ఓటర్లు శ్వేత సుధాకర్‌ను గెలిపించుకున్నారు.

## నేరేడుచర్లలో జనసేన బోణీ

### 14వ వార్డులో గెలుపొందిన ఆరూరి విజయలక్ష్మి



సూర్యాపేట, **ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** జనసేన పార్టీ తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఖాతా తెరిచింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో జనసేన అభ్యర్థి ఘన విజయం సాధించారు. 14వ వార్డులో జనసేన తరపున పోటీ చేసిన విజయలక్ష్మి ఆరూరి 60 ఓట్ల మెజారిటీతో విజయకేతనం ఎగుర వేసింది. ఈ గెలుపుపై ఇప్పటికే పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి రియాక్ట్ అయ్యారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. కాగా.. ఈ మున్సిపాలిటీలో మొత్తం 15 స్థానాలకు గానూ 9 వార్డుల్లో కాంగ్రెస్, 5 వార్డుల్లో బీఆర్ఎస్ గెలుపొందగా, ఒక వార్డును జనసేన దక్కించుకుంది. అయితే.. విజయలక్ష్మి గెలపుతో తెలంగాణలోని జనసేన కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. తెలంగాణలో ఇప్పటివరకు ప్రధాన పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో కొత్త శక్తిగా ఎదగాలని చూస్తున్న జనసేనకు ఈ గెలుపు ప్రోత్సాహాన్ని ఇస్తోందని అభిమానులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో గ్రామ, పట్టణ స్థాయిలో పార్టీ విస్తరణపై దృష్టి పెట్టే అవకాశాలు ఉంటాయా అనే అంశాన్ని జనసేన పార్టీ నిర్ణయించాలి.

## గౌస్ జాని కి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..





**ప్రజావినికిడి,(షాద్ నగర్):** షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికలలో 1వ వార్డు బీఆర్ఎస్ పార్టీ నుండి గెలుపొందిన గౌస్ జాని కి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తనయుడు రామకృష్ణ,యువ నాయకులు దినేష్ నగర్,శివచారి, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## హంగ్ మున్సిపాలిటీల్లో హార్స్ ట్రేడింగ్

### అప్పడే బేరసారాలు మొదలు

**హైదరాబాద్ ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** తెలంగాణ వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్‌లు,116 మున్సిపాలిటీ లకు బుధవారం ఎన్నికలు జరుగగా.. శుక్రవరాంఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 136 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరుగుతోంది. మధ్యాహ్నం 3 గంటల వరకు వెల్లడి అయిన ఫలితాల ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ 90కి పైగా మున్సిపాలిటీల్లో, బీఆర్ఎస్ 24 మున్సిపాలిటీల్లో విజయాలు సాధించాయి. అయితే పలు చోట్ల అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మధ్య గట్టిపోటీ నడుస్తోంది. ఏ పార్టీ మ్యాజిక్ ఫిగర్ అందుకోక కొన్నిచోట్ల హంగ్ ఏర్పడింది. దాంతో ఆయా మున్సిపాలిటీల్లో హార్స్ ట్రేడింగ్‌కు తెరలేచింది. మ్యాజిక్ ఫిగర్ కోసం అప్పుడే బేరసారాలు మొదలయ్యాయి. చైర్ పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో స్వతంత్రులు, ఎక్స్ అఫిషియో సభ్యులు కీలకం కానున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు మొత్తం 16 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. ప్రజలు హంగ్ తీర్పు ఇచ్చిన మున్సిపాలిటీల్లో పరకాల, అలంపూర్, నర్సాపూర్, జిన్నారం, కేసముద్రం, ఇస్నాపూర్, ఆసిఫాబాద్, జమ్మికుంట, జనగామ, కామారెడ్డి, అమరచింత, కోహీర్, దేవరకద్ర, ఆసిఫాబాద్, వేములవాడ, రాయికల్, జహీరాబాద్, మహబూబాబాద్, ఆలియాబాద్, బోధన్, గద్వాల, బెల్లంపల్లి, క్యాతనపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇప్పటివరకు వెల్లడైన ఫలితాల ప్రకారం.. బీఆర్ఎస్ పార్టీ తన ఖాతాలో 24 మున్సిపాలిటీలు వేసుకుంది. సంగారెడ్డి జిల్లాలోని గడ్డపోతారం, ఇంద్రేశం, గుమ్మడిదల.. జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజ, మహబూబాద్ జిల్లాలోని తొర్రూరు, రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఎల్లంపేట మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇక అధికార కాంగ్రెస్ పార్టీ నేరేడు చర్ల, హుజూర్‌నగర్, హాలియా, కోదాడ, నందికొండ, చండూరు, భూత్పూర్, ధర్మపురి, భీంగల్, బిచ్కుంద, బాన్సువాడ, ఎల్లారెడ్డి, చొప్పదండి, సుల్తానాబాద్, మంథని, హుస్నాబాద్, మరిపెడ, డోర్నకల్, నారాయణఖేడ్, అశ్వారావుపేట, స్టేషన్ ఘన్‌పూర్, ఆందోలు-జోగిపేట, సదాశివపేట, హుజూరాబాద్, కొల్లాపూర్, మద్దూరు, పెబ్బేరు, స్టేషన్‌ఘన్‌పూర్, మధిర మున్సిపాలిటీల్లో గెలిచింది.

కాగా అనూహ్య రీతిలో వడ్డేపల్లి మున్సిపాలిటీని ఫార్వర్డ్ బ్లాక్ గెలుచుకుంది. ఇక ఇతర పార్టీలు ఏ మున్సిపాలిటీలోనూ అధికారానికి దరిదాపుల్లో లేవు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఎల్లంపేట మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మున్సిపల్ పరిధిలోని 24 వార్డులకు గాను బీఆర్ఎస్ 12, కాంగ్రెస్ 8, బీజేపీ 4 స్థానాలను దక్కించుకుంది. బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలు విస్తృత ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు అవిరాళంగా కృషి చేశారు.

## మొబైల్ ఏఐ చెస్ట్ ఎక్స్ రే స్క్రీనింగ్ ఉచిత క్యాంప్



**వాజేడు ఫిబ్రవరి,13, ప్రజావినికిడి,** వాజేడు మండలం అయ్యావారిపేట గ్రామంలో. ఎంపిపిఎస్ అయ్యవారిపేట స్కూల్ నందు పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొబైల్ ఏఐ చెస్ట్ ఎక్స్ రే స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించడం జరిగింది.ఈ శిబిరం నందు 129 మందికి ఈ ఎక్సే రే తీయడం జరిగింది. అందులో 37 మంది టిబీ ఇతర అనుమానితులను గుర్తించడం జరిగింది. ఈ సందర్భంగా ఎచ్ఈఓ వేణుగోపాల్ కృష్ణ మాట్లాడుతూ, క్షయ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి. జిల్లా క్షయ నివారణ అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించడం జరిగిందని తెలిపారుఈ క్యాంప్ ముఖ్యంగా డయాబెటిక్, హైపర్ టెన్షన్,జ్వరం, దగ్గు,ఇతర వ్యాధులు కలిగిన ప్రతిఒక్కరు చెస్ట్ ఎక్స్ రే స్క్రీనింగ్ లో పాల్గొన్నారు ఆధునిక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ టెక్నాలజీ తో 5 నిమిషాలలో ఎక్స్ రే పరీక్ష పూర్తవుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో టిబి అలర్ట్ ఇండియా డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ టి రాజు ఎక్స్ రే టెక్నీషియన్ సంతోష్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎచ్ఏ శారద,తిరుపతి, శ్రీను ఆశ వర్కర్స్ 102 సిబ్బంది సురేష్ పాల్గొన్నారుగ్రామ పెద్దలు, గ్రామ యువత సహకారం ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరిగింది


## కొత్తగూడెం కార్పోరేషన్‌లో కమ్యూనిస్టుల హవా

### అత్యధిక స్థానాలతో ముందంజలో సిపిఐ

#### హంగ్ ఏర్పడడంతో క్యాంప్ రాజకీయాలు మొదలు




**భద్రాద్రికొత్తగూడెంఫిబ్రవరి 13ప్రజావినికిడి,** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కొత్తగా ఏర్పడిన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ వేదికగా ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకోగా, కొత్తగూడెం కార్పొరేషన్‌లో మాత్రం సీపీఐ అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఇక్కడ ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో ఇప్పటికే క్యాంపు రాజకీయాలు వేడెక్కాయి. మొత్తం 60 డివిజన్లు ఉన్న కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐ మిత్రపక్షాలతో కలిసి 25 స్థానాల్లో విజయం సాధించి ముందంజలో ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ 21 డివిజన్లను కైవసం చేసుకోగా, బీఆర్ఎస్ 9 స్థానాల్లో గెలుపొంది కింగ్ మేకర్‌గా మారింది. బీజేపీ, సీపీఎం తలో స్థానాన్ని గెలుచుకోగా, ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. స్వతంత్రులలో ముగ్గురు ఇప్పటికే సీపీఐకి మద్దతు ప్రకటించే అవకాశం ఉండటంతో ఎర్రజెండా పీఠం ఎక్కే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కార్పొరేషన్ పీఠాన్ని దక్కించుకోవడానికి సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. తమ అభ్యర్థులు చేజారిపోకుండా ఉండేందుకు సీపీఐ ఇప్పటికే క్యాంపు రాజకీయాలకు తెరలేపింది.



మరోవైపు, బీఆర్ఎస్ గెలిచిన 9 స్థానాలు ఇక్కడ అత్యంత కీలకం కానున్నాయి. కాంగ్రెస్‌తో ఉన్న విభేదాల దృష్ట్యా బీఆర్ఎస్ శ్రేణులు సీపీఐకి మద్దతు ఇచ్చే దిశగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. పాల్వంచ మున్సిపాలిటీని కొత్తగూడెంలో విలీనం చేసిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికలు కావడంతో ఈ విజయం అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది.ఖమ్మం , భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఏడు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ వన్ సైడ్ విజయాలను నమోదు చేసింది. అయితే ఫలితాల వెల్లడి సమయంలో కొన్ని చోట్ల రీకౌంటింగ్ వివాదాలు తలెత్తాయి. ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థి కేవలం 3 ఓట్ల తేడాతో ఓడిపోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయిన చోట రీకౌంటింగ్ నిర్వహిస్తూ, తమకు అవకాశం ఇవ్వడం లేదని బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. వైరా, సత్తుపల్లి, కల్లూరులో కూడా ఇదే తరహా వివాదాలు కొనసాగుతున్నాయి.

## నిజామాబాద్ కార్పోరేషన్‌పై బిజెపి పట్టు

### ఏడు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ 4 గెలుపు



**నిజామాబాద్,ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** తెలంగాణ వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. అత్యధిక మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ సత్తా చాటుతోంది. నిజామాబాద్ కార్పోరేషన్‌పై బిజెపి పట్టు సాధించింది.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనూ అధికార పార్టీ తన హవాను కొనసాగిస్తోంది. మొత్తం ఒక కార్పొరేషన్, 7 మున్సిపాలిటీలకు గానూ.. 4 మున్సిపాలిటీలను హస్తం పార్టీ కైవసం చేసుకుంది. భీంగల్ మున్సిపాలిటీలో మొత్తం 12 సీట్లకు గాను కాంగ్రెస్ - 8,బీఆర్ఎస్ - 4 స్థానాలు గెలుచుకుంది. . బిచ్కుంద మున్సిపాలిటీలో మొత్తం 12 వార్డులు ఉండగా కాంగ్రెస్ - 8, బీఆర్ఎస్ - 2 స్థానాలు దక్కించుకుంది. ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో 12 స్థానాలకు గాను కాంగ్రెస్ - 10, బీఆర్ఎస్ - 1, ఇండిపెండెంట్ - 1 స్థానంలో గెలుపొందారు. బిచ్కుంద మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కువ వార్డులను సొంతం చేసుకున్నారు. బిచ్కుంద మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మొత్తం 12 వార్డులకు గానూ 10 వార్డుల్లో హస్తం పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. బీఆర్ఎస్ 2 వార్డులను మాత్రమే సొంతం చేసుకుంది.వార్డు 1: కాంగ్రెస్ - గోనె హన్మవ్వ,వార్డు 2: కాంగ్రెస్ - చిన్న మారుతి,వార్డు 3: కాంగ్రెస్ - కార్తీక ధర్పల్,వార్డు 4: బీఆర్ఎస్ - బొమ్మల అనితవార్డు 5: బీఆర్ఎస్ - శ్యామల,వార్డు 6: కాంగ్రెస్ - నౌషా నాయక్,వార్డు 7: కాంగ్రెస్ - ముజాహిద్,వార్డు 8: కాంగ్రెస్ - షేక్ గులాం సందానీ,వార్డు 9: కాంగ్రెస్ - ధర్పల్ గంగాధర్,వార్డు 10: కాంగ్రెస్ - మఠం మానస,వార్డు 11: కాంగ్రెస్ - భాగ్యలక్ష్మి,వార్డు 12: కాంగ్రెస్ - సీమ షెట్కర్ గెలుపొందారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కాశ్మీర్‌తో కలిపి భారత్ మ్యాప్

## పాక్ గగ్గోలుతో తొలగించిన అమెరికా

ఇస్లామాబాద్,**ఫిబ్రవరి 13ప్రజావినికిడి,**
భారత్‌తో ట్రేడ్‌డీల్‌కు అంగీకారం కుదిరిన వేళ.. అమెరికా వాణిజ్య ప్రతినిధి భారత్ మ్యాప్ ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనిపై పాకిస్థాన్ గగ్గోలు పెట్టింది. చివరకు అగ్రరాజ్య అధికారులకు నచ్చజెప్పి ఆ మ్యాప్‌ను తొలగింపజేశారు. కశ్మీర్‌లోని కొంత భాగాన్ని పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. కశ్మీర్‌ను జీవనాడిగా చెప్తూ.. ఉగ్రవాదాన్ని ఎగదోస్తోంది. ఇలాంటి సమయంలో దాయాది పేర్కొంటున్నట్టుగా కాకుండా.. భారత్ మ్యాప్ ఉన్నది ఉన్నట్టుగా అమెరికా షేర్ చేసింది. దీన్నిచూసి తట్టుకోలేకపోయిన పాకిస్థాన్.. అమెరికా అధికారులను ఒప్పించి, దాన్ని తొలగించాలని ప్రాధేయపడటంతో వారు దానిని తొలగించారు. మ్యాప్ షేర్ చేయగానే తాము వెంటనే అగ్రరాజ్య అధికారులను సంప్రదించామని పాక్ విదేశాంగశాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబి వెల్లడించడమే ఇందుకు నిదర్శనం. కాగా.. కశ్మీర్ విషయంలో భారత్ తన వైఖరిని బలంగా వినిపిస్తోంది. ఎప్పటికీ కశ్మీర్ భారత భూభాగమేనని తేల్చిచెప్పింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ లేకుండా జమ్మూకశ్మీర్ అసంపూర్ణమని గతంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్‌కు పీవోకే విదేశీ భూభాగం అవుతుందే తప్ప మరొకటి కాదని అన్నారు.

# చీనాబ్ నదిపై సావల్‌కోట్ ప్రాజెక్టు


## వివరాలు కోరిన పాక్ విదేశాంగ ప్రతినిధి

ఇస్లామాబాద్**ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** కశ్మీర్‌లో చీనాబ్ నదిపై భారత్ నిర్మించనున్న సావల్‌కోట్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని పాకిస్థాన్ కోరింది. ఈ మేరకు భారత్‌కు లేఖ రాసినట్లు ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి తాహిర్ వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సావల్‌కోట్ ప్రాజెక్టు అంశాన్ని ఇది వరకే ఇండస్ వాటర్ కమిషనర్ల స్థాయిలో చర్చించినట్లు తెలిపారు. ఇదే అంశంపై గతేడాది జులైలో పాక్ ఇండస్ వాటర్ కమిషనర్ భారత్‌కు లేఖ రాసినట్లు చెప్పిన ఆయన.. తాజాగా మరోసారి లేఖ రాశారని అన్నారు.'ఫిబ్రవరి 11న పాక్ ఇండస్ వాటర్ కమిషనర్, భారత్ ఇండస్ వాటర్ కమిషనర్‌కు లేఖ రాశారు. సింధు జలాల ఒప్పందం 1960 అనుసరించి సావల్‌కోట్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని లేఖలో కోరారు.' అని తాహిర్ మీడియాకు వివరించారు. గతేడాది ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్‌పై భారత్ చర్యలకు ఉపక్రమించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే సింధు నదీ జలాల ఒప్పందం అమలును నిలిపివేసింది.చీనాబ్ నదిపై సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదన 1980ల నుంచే ఉంది. దీనిపై పాకిస్థాన్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాదాపు 40 ఏళ్లుగా పక్కన పెట్టాల్సి వచ్చింది. అయితే, సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేయడం.. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. 1856 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు రూ.22 వేల కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. రెండు దశల్లో దీన్ని నిర్మించనున్నారు.

# ప్రేమ కోసం ప్రాణత్యాగం..



## వాలెంటైన్స్ డే వెనుక ఉన్న అసలు కథ!



వరల్డ్ వైడ్‌గా ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే వాలెంటెన్స్ డే రానే వచ్చేసింది.. గులాబీ పూలతో, ప్రత్యేకమైన గిఫ్టులతో, ప్రేమ కురిపించే శుభాకాంక్షలతో ఈరోజు ప్రేమికులంతా ఎంతో ఆనందంగా ఉంటారు. అయితే, ఈ రోజు కేవలం ఒక వేడుక మాత్రమే కాదని చరిత్ర చెబుతోంది.. దీని వెనక గొప్ప త్యాగంతో పాటు సుదీర్ఘ చరిత్ర దాగి ఉందని మీ అందరికీ తెలుసా? అసలు ఈ వాలెంటెన్స్ డే ఎలా మొదలైంది? ఫిబ్రవరి 14వ తేదీన ఉన్న అసలైన ప్రాముఖ్యత ఏంటి? అనే అంశాలను మనం పూర్తిగా తెలుసుకుందాం.
వాలెంటెన్స్ డేకు సంబంధించిన మూలాలు క్రీస్తు శకం మూడో శతాబ్దపు రోమన్ సామ్రాజ్యం నుంచి ఉన్నాయి. అప్పట్లో రోమన్ సామ్రాజ్యాన్ని రెండవ క్లాడియస్ పరిపాలించేవాడు. అయితే ఈ రాజు ఒక వింత నిబంధన అమలు చేస్తూ వచ్చేవాడు. ఈ రోమన్ రాజు వివాహం చేసుకున్న పురుషుల కంటే.. ఒంటరిగా ఉన్న యువకులే యుద్ధంలో సమర్థవంతంగా పోరాడుతారని ఎక్కువగా నమ్మేవారు. అందుకే తన రాజ్యంలో ఉన్న యువకులంతా ఎవరూ పెళ్లి చేసుకోకూడదని రాజు ఆజ్ఞ జారీ చేస్తాడు..కానీ ఆ సమయంలో సెయింట్ వాలెంటైన్ అనే ఒక క్రైస్తవ పాస్టర్ ఆ రాజు కళ్ళు కప్పి.. ప్రేమకు వయస్సుతో సంబంధం లేదని.. వివాహం ఒక పవిత్ర బంధం అని భావించి.. ఆయన ఆరాధ్యంలో ఉన్న రాజుకు తెలియకుండా ప్రేమికులకు రహస్యంగా వివాహాలు జరిపించేవారు.. ఆ వాలెంటైన్ చేస్తున్న పనులను క్లాడియస్ చక్రవర్తి గుర్తించారు. ఆయనను బంధించి మరణశిక్ష విధిస్తాడు. అయితే ఆ పాస్టర్ జైల్లో ఉన్న సమయంలో అక్కడే ఉన్న జైలర్ కుమార్తెతో స్నేహం పెంచుకుంటారు. అయితే, ఆమెకు కంటిచూపు ఉండదు.. ఆ పాస్టర్ తన శక్తిని ఉపయోగించి ఆమెకు కంటి చూపు తెప్పిస్తారని చరిత్రకారులు చెబుతున్నారు. ఆ పాస్టర్ను ఉరి తీసే ముందు.. ఆమెకు ఒక లేఖను రాస్తూ.. దాని కింద ఫ్రమ్ యువర్ వాలెంటైన్ అని సంతకం చేశారు. అది ఫిబ్రవరి 14వ తేదీ రోజే జరిగింది.. క్రీస్తు శకం 496 లో గెలాసియస్ ఈరోజును అధికారికంగా.. సెయింట్ వాలెంటైన్స్ డేగా ప్రకటించారు. ప్రాచీన రోమన్లు ఎంతో ప్రత్యేకంగా జరుపుకునే లౌపర్కాలియా పండగను క్రమంగా క్రైస్తవ మతంలోకి మార్చి.. వాలెంటెన్స్ డేగా నామకరణం చేశారు. 14వ శతాబ్ద సమయంలో బ్రిటన్‌తో పాటు ఫ్రాన్స్ దేశాలకు సంబంధించిన కవులు వాలెంటెన్స్ డే పై రచనలు చేసి.. ప్రపంచవ్యాప్తంగా తెలిసేలా చేశారు. దీంతో అప్పటినుంచి ప్రతి ఏడాది ఫిబ్రవరి 14వ తేదీన వ్యాలెంటెన్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.


# 16 ఏళ్ల లోపు చిన్నారులకు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించాలి: మండలిలో నాగబాబు

**ప్రాణాంతక చాలెంజ్‌ల బారినపడి పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన**

**సోషల్ మీడియా నియంత్రణకు ప్రత్యేక చట్టాలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌లను కేవలం చదువుకే పరిమితం చేయాలని సూచన**

**హోం, ఐటీ, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపు**



అమరావతి,**ఫిబ్రవరి 13ప్రజావినికిడి,**
16 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులకు సోషల్ మీడియా వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని జనసేన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కోరారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ... చిన్నారులు సైబర్ నేరాలు, ప్రమాదకరమైన ఆన్‌లైన్ ట్రెండ్స్ బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. సోషల్ మీడియా కట్టడికి ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సోషల్ మీడియాలో మంచి, చెడులను విశ్లేషించుకునే విచక్షణ పెద్దలకు ఉంటుందని, కానీ 16 ఏళ్ల లోపు పిల్లలకు ఆ పరిపక్వత ఉండదని నాగబాబు అన్నారు. గతంలో 'బ్లూ వేల్ చాలెంజ్' వంటి ప్రమాదకరమైన క్రీడలకు ఆకర్షితులై ఎంతోమంది చిన్నారులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం 'మెమో చాలెంజ్', 'స్కల్ బ్రేకర్ చాలెంజ్', 'ఫైర్ చాలెంజ్' వంటి ప్రాణాంతకమైన సాహసాలు పిల్లలను ఆకర్షిస్తున్నాయని, వాటికి ఆకర్షితులై కొందరు ప్రాణాలు కోల్పోతుంటే, మరికొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లుగా సోషల్ మీడియాను కట్టడి చేసేందుకు కఠినమైన చట్టాలు రూపొందించాలని నాగబాబు ప్రభుత్వానికి సూచించారు. ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, డెన్మార్క్ వంటి పలు ఐరోపా దేశాలు ఇప్పటికే 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఐటీ, పోలీస్, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేసి సోషల్ మీడియా అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.హోం, ఐటీ, విద్యా శాఖలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాల్లో కేవలం విద్యకు సంబంధించిన సమాచారం మాత్రమే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ ట్యాబ్‌లలో సోషల్ మీడియా యాప్‌లను వాడకుండా పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. పాఠశాలల్లో జరిగే పేరెంట్స్-టీచర్స్ సమావేశాల్లో తల్లిదండ్రులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని, తద్వారా చిన్నారుల భవిష్యత్తును కాపాడవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

# 19 నుంచి శుభముహూర్త కాలం

## ఏప్రిల్ 29 వరకు ఉంటాయంటున్న పండితులు



కాకినాడ,**ఫిబ్రవరి 13ప్రజావినికిడి,** ధనుర్మాసం.. మౌఢ్యమితో శుభ ముహూర్తాలు లేక ఇంతకాలు వివాహాలు, ఇతర శుభకార్యాల జరగలేదు. ముహూర్తాలు లేక వివాహాలు నిలిచి పోయిన వారికి ఇది శుభవార్తే. ఈ నెల 19వ తేదీ నుంచి వరుస ముహూర్తాలతో పెళ్లి సందడి ప్రారంభం కానుంది. నాలుగు నెలల పాటు వరుస ముహూర్తాలతో వివాహ వేదికలు కళకళ లాడనున్నాయి. మౌఢ్యమి రోజుల్లో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు చేసుకుంటే శుభ ప్రథంగా ఉండదని పండితులు చెప్పారు. దీంతో ఆయా దినాల్లో ఆయా కార్యాలు జరగలేదు. ఈక్రమంలో మే వరకు అన్ని రకాల శుభకార్యాలకు అనుకూల మైన రోజులు ఉన్నట్లు పండితులు చెపుతున్నారు. ఫిబ్రవరి 19 నుంచి ఏప్రిల్ 29 వరుకు ముహూర్తాలు ఉన్నట్లు పండితులు ప్రకటించారు.మౌఢ్యమి కారణంగానే డిసెంబరు నుంచి శుభ ముహూర్తాలు లేవు. ఈ కారణంగా వివాహాలు, ఇతర శుభకార్యాలు నిలిచిపోయాయి. ఈ సంవత్సరం ఎక్కువ ముహూర్తాలు ఉన్నందున వివాహాలు కూడా ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. దీంతో అటు వస్త్ర, బంగారం వ్యాపారాలు కళకళ లాడనున్నాయి.

# ఏపీలో భారీ బడ్జెట్...పయ్యావుల వరాలు?

అమరావతి,**ఫిబ్రవరి 13ప్రజావినికిడి,**
బడ్జెట్ అంటేనే ఎన్నో ఆశలు. ఇది ప్రతీ ఇంటి నుంచి మొదలవుతుంది. ఎంత ఖర్చు ఎంత ఆదాయం. ఈ చిట్టా పద్దులె బడ్జెట్. అంతే కాదు మిగులు తగులూ నడుమ ఆశలను తీర్చే అవకాశాలను చూడడమే బడ్జెట్. రాష్ట్ర బడ్జెట్ అయినా దేశ బడ్జెట్ అయినా వరాల కోసం ఎదురుచూస్తారు. తమకు ఏమిటి ఇస్తున్నారు. ఏ శుభ వార్తలు మోసుకుని వస్తున్నారు అని కూడా ఎంతో ఆసక్తిగా వేచి చూస్తూ ఉంటారు. కేంద్ర బడ్జెట్ లో అయితే మధ్య తరగతి అనుకున్న విధంగా ఊరట దక్కలేదు అన్న అసంతృప్తి ఉంది. ఇక ఏపీ బడ్జెట్ గురించి అయిదు కోట్ల మంది ప్రజలు ఎంతో ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు.

### పెద్ద నంబర్ తోనే :

ఇక ఏపీ బడ్జెట్ చూస్తే ఈసారి భారీ సైజ్ గానే ఉంటుందని చెబుతున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏకంగా మూడున్నర లక్షల కోట్ల రూపాయలతో ఒక సమగ్రమైన బడ్జెట్ నే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూపొందించారు అని అంటున్నారు. ఏపీలోని వివిధ వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా అనేక కార్యక్రమాల్లో పాటు సంక్షేమం అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ ఈ బడ్జెట్ ఉంటుంది అని అంటున్నారు. ఇదిలా ఉంటే ఈ బడ్జెట్ లో అనేక మెరుపులు కూడా ఉండొచ్చు అని కూడా అంతా ఆశిస్తున్నారు. గతసారి మూడు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టారు, ఈసారి మరో యాభై లక్షల కోట్లు పెరుగుతోంది అంటే మరింతగా



ప్రయోజనం చేకూరుతుంది అని అంటున్నారు.

### ప్రాధాన్యత రంగాలకు :

పయ్యావుల కేశవ్ బడ్జెట్ లో ప్రాధాన్యత రంగాలకు పెద్ద పీట వేయబోతున్నారు అని అంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయం రైతులకు ప్రాముఖ్యత లభించబోతోంది అని తెలుస్తోంది. అలాగే మహిళా సంక్షేమానికి కూడా అగ్ర తాంబూలం ఇవ్వబోతున్నారు అంటున్నారు ఇక సూపర్ సిక్స్ హామీలలో నాలుగింటిని ఇప్పటికే అమలు చేస్తున్నారు, వీటికి బడ్జెట్ లో నిధులు దండీగా కేటాయింపులు చేస్తారు అని అంటున్నారు.

### బ్యాలెన్స్ చేస్తూ :

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఒక విషయం స్పష్టం అవుతోంది. అభివృద్ధి సంక్షేమం ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ వస్తున్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమాన్ని వీడేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. దాంతో పాటు గతానికి కంటే ఎక్కువగానే ఖర్చు చేస్తున్నారు. ఇపుడు కూడా 2026-27 బడ్జెట్ లో సంక్షేమానికి కీలకమైన ప్రాధ్యాత ఇవ్వబోతున్నారు అని అంటున్నారు. అదే సమయంలో అభివృద్ధి మీద కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి ఫోకస్ పెడుతూ వస్తోంది. దాంతో అమరావతి రాజధాని పోలవరం కి ముందుగా ఖర్చు చేసే నిధులతో పాటు సాగు నీటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం, మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేయడం వంటివి ఈసారి బడ్జెట్ లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయని అంటున్నారు.

### మంత్రివర్గం ఆమోదం :

ఇక 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ కి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం కోసం శనివారం ఉదయం పదిన్నరకు చంద్రబాబు అధ్యక్షతన సమావేశం అవుతుంది. ఆ తరువాత పదకొండు గంటల పదిహేను నిముషాలకు బడ్జెట్ ని ఆర్థిక మంత్రి అసెంబ్లీలో ప్రవేశపెడతారు ఇక శాసనమండలిలో బడ్జెట్ ని మంత్రి కొల్లు రవీంద్ర ప్రవేశపెడతారు అని అంటున్నారు వ్యవసాయ బడ్జెట్ ని మంత్రి అచ్చెన్నాయుడు సభలో ప్రవేశ పెడతారు అని అంటున్నారు. మొత్తం మీద పయ్యావుల ఆర్థిక మంత్రిగా ప్రవేశపెడుతున్న పూర్తి స్థాయి రెండవ బడ్జెట్ ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది.

# శివరాత్రి 15 ఆదివారమే

## తేల్చి చెప్పిన పండితులు

శ్రీశైలం,**ఫిబ్రవరి 13ప్రజావినికిడి,**



పరమ శివుడి పవిత్రమైన పర్వదినం మహా శివరాత్రి. మహా శివరాత్రి రోజు ఉపవాసంతో జాగారం చేస్తే ఎంతో పుణ్యంగా భావిస్తారు హిందూవులు. ఈ ఏడాది పండుగ ఏ రోజు వచ్చింది.. 15వ తేదీనా.. 16వ తేదీనా.. ఆదివారమా.. సోమవారమా అనే సందేహం చాలా మందిలో వ్యక్తం అవుతుంది. అందరూ 15వ తేదీనే మహారాత్రి అంటున్నా.. కొందరు మాత్రం 16వ తేదీ కదా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. హిందూ మతంలో అత్యంత పవిత్ర పండుగల్లో ఒకటి అయిన మహాశివరాత్రి ఫిబ్రవరి 15వ తేదీ నాడు జరుపుకోవాలని పండితులు నిర్ణయించారు. చతుర్దశి తిథి ప్రారంభం: ఫిబ్రవరి 15 సాయంత్రం 5:04 గంటలకు ప్రారంభమై, తిథి ముగింపు: ఫిబ్రవరి 16 సాయంత్రం 5:34 గంటల వరకు ఉంటుంది. నిషిత కాల ముహూర్తం : ఫిబ్రవరి 15 12:09 నుండి 1:01 ఉంటుంది. హిందూ పండుగలను సాధారణంగా ఉదయ తిథి ..సూర్యోదయం.. ఆధారంగా జరుపుకున్నప్పటికీ, నిషిత కాలంలో చతుర్దశి వచ్చే రోజున మహాశివరాత్రిని జరుపుకుంటారు. ఈ నియమం ఆధారంగా, మహాశివరాత్రిని ఫిబ్రవరి 15న జరుపుకుంటారు. మహాశివరాత్రి రోజు అభిషేకం చేసేందుకు శుభ ముహూర్త సమయాలు మహాశివరాత్రి రోజు రాత్రి శివుని పూజకు అత్యంత పవిత్రమైన సమయం నిషిత కాలం అని పండితులు సూచిస్తున్నారు.

# ఫిబ్రవరి 15న భారత్, పాక్ మ్యాచ్



టీ20 ప్రపంచ కప్ 2026 లో అత్యంత ఆసక్తికరమైన మ్యాచ్ దగ్గర పడుతోంది. కొన్ని రోజుల కిందటి వరకు భారత్, పాకిస్తాన్ లీగ్ మ్యాచ్ జరుగుతుందా లేదా అని అంతా టెన్షన్ పడ్డారు. కానీ పాక్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో పాక్ జట్టు భారత్‌తో మ్యాచ్ ఆడేందుకే చెప్పింది. ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో భారత్, పాకిస్తాన్ జట్లు తలపడేందుకు సిద్ధమవుతున్నాయి. ఇది గ్రూప్-ఎ లో జరుగుతున్న లీగ్ మ్యాచ్, కానీ ఫైనల్ మ్యాచ్ కంటే దాయాది జట్ల పోరు తక్కువ కాదు. ఈసారి టీ20 ప్రపంచ కప్‌ను భారత్, శ్రీలంక నిర్వహిస్తున్నాయి. భద్రత, రాజకీయ కారణాల వల్ల పాకిస్తాన్ మ్యాచ్‌లన్నీ శ్రీలంకలో నిర్వహించేందుకు షెడ్యూల్ చేశారు. ఈ పరిస్థితిలో, భారత జట్టు తన మొదటి రెండు మ్యాచ్‌లను భారత్ వేదికగా ఆడింది. కానీ పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడేందుకు టీమిండియా జట్టు శ్రీలంకకు వెళుతుంది. రెండు మ్యాచ్ లలో నెగ్గిన భారత్ ఆదివారం తమ మూడో మ్యాచులో పాక్‌తో తలపడుతుంది. ప్రస్తుత టీ20 వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో భారత జట్టు అద్భుతమైన ఫామ్‌లో కనిపిస్తోంది. గెలిచిన రెండు మ్యాచ్‌లలో జట్టు కొన్ని లోపాలు కనిపించినా, తక్కువ సమయంలోనే వాటిని అధిగమించి ప్రత్యర్థి జట్లపై విజయాలు సాధించింది. బ్యాటింగ్‌లో దూకుడు, బౌలింగ్ అటాక్‌తో భారత్‌కు విజయాలు వస్తున్నాయి. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని జట్టు కప్పును నిలబెట్టుకునేలా కనిపిస్తోంది. ఫాస్ట్ బౌలింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ప్రభావం చూపుతారు. మరోవైపు పాకిస్తాన్ జట్టు కూడా కప్పు కొట్టాలని భావిస్తోంది. పాక్ జట్టు కూడా టోర్నీలో 2 మ్యాచ్‌లు గెలిచింది. కొత్త నాయకత్వంలో జట్టు సంయమనం, దూకుడు మధ్య బ్యాలెన్స్ చూపించింది. షాహీన్ అఫ్రిది, నసీమ్ షా ఫాస్ట్ బౌలింగ్ ప్రత్యర్థి జట్టుకు ఛాలెంజ్ విసురుతాయి. దాంతో ఆదివారం జరగనున్న భారత్, పాక్ మ్యాచ్ పై ఆసక్తి పెరుగుతోంది. కొలంబో పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలం. కనుక మిడిల్ ఓవర్లలో స్పిన్నర్ల పాత్ర చాలా ముఖ్యం. ఒత్తిడిని తట్టుకుని మిడిల్ ఓవర్లు ఆడిన జట్టు విజయం సాధించవచ్చు. ప్రపంచ కప్‌లో భారత్ పైచేయి సాధించిందని గణాంకాలు చెబుతున్నాయి. అయితే, పాకిస్తాన్ కూడా అంచనాలు లేకుండా బరిలోకి దిగి సంచనాలు చేస్తుందని తెలిసిందే. గ్రూప్ స్టేజీ నుంచి సూపర్ 8కు వెళ్లే జట్లు కూడా ఇవే. అయితే ఆ మ్యాచ్ నెగ్గిన టీం దాదాపుగా సూపర్-8 బెర్త్ కన్ఫామ్ చేసుకుంటుంది. భారత్, పాక్ జట్లు ఫిబ్రవరి 15న తలపడతాయి. టాస్ సాయంత్రం 6:30 గంటలకు వేయనుండగా, రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం అవుతుంది. క్రికెట్ ప్రేమికులు ఈ మెగా మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్, జియో హాట్‌స్టార్‌లో లైవ్ చూడవచ్చు.



## యూఏఈ చేతిలో భారత్ చిత్తు!

**- మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీ**

మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. పసికూన యూఏఈ చేతిలో రాధయాదవ్ సారథ్యంలోని భారత-ఏ జట్టు ఖంగుతిన్నది. దాంతో ఈ టోర్నీని ఘోర పరాజయంతో ప్రారంభించింది. గ్రూప్-ఏలో భాగంగా శుక్రవారం యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన భారత్-ఏ 7 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఇషా ఒజా(72 నాటౌట్, 2/30) ఆల్‌రౌండ్ షోతో భారత్-ఏ పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్- ఏ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 130 పరుగులు చేసింది. అనుష్క శర్మ(45 బంతుల్లో 7 ఫోర్లతో 47), తనూజ కన్వార్(25 బంతుల్లో 5 ఫోర్లతో 34) మినహా మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. కెప్టెన్ రాధాయాదవ్(7)తీవ్రంగా నిరాశపర్చింది. యూఏఈ బౌలర్లలో సమైరా ధరింధర్కా(3/40) మూడు వికెట్లు తీయగా.. వైష్ణవే మహేష్(2/13), ఇషా ఓజా(2/30) రెండేసి వికెట్లు పడగొట్టాడు. సురక్ష కొట్టే, అతిగే సిల్వా చెరో వికెట్ తీసారు. అనంతరం యూఏఈ 19.2 ఓవర్లలో 3 వికెట్లకు 131 పరుగులు చేసి గెలుపొందింది. కెప్టెన్ ఇషా ఓజా(61 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 72 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించింది. సమైరా(31 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 34) కీలక ఇన్నింగ్స్ ఆడింది. భారత బౌలర్లలో రాధా యాదవ్, ప్రేమ రావత్, తనూజ కన్వార్ తలో వికెట్ తీసారు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ల్లో పాకిస్థాన్(ఆదివారం), నేపాల్(మంగళవారం)తో తలపడనుంది. మొత్తం 8 జట్లు ఈ టోర్నీలో తలపడుతుండగా రెండు గ్రూప్స్ విభజించారు. రెండు గ్రూప్స్ నుంచి టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరుతాయి. భారత్ సెమీఫైనల్ చేరాలంటే తదుపరి రెండు మ్యాచ్‌లను మెరుగైన రన్‌రేట్‌తో గెలవాలి. లేదంటే లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమిస్తోంది.

## నా ఆటకు దిష్టి పెట్టకండి

**- టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా**



తన ఆటకు దిష్టి తగలవద్దని టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అన్నాడు. ప్రస్తుతం తాను సూపర్ ఫామ్‌లో ఉన్నానని, బ్యాటింగ్, బౌలింగ్‌లో మంచి టచ్‌లో కనిపిస్తున్నానని తెలిపాడు. ఆటను ఆస్వాదిస్తున్నానని చెప్పిన హార్దిక్ పాండ్యా.. ఐసీసీ టీ20 ప్రపంచకప్ కోసం ఆర్మీ తరహా ట్రైనింగ్ తీసుకున్నట్లు వెల్లడించాడు. గ్రూప్-ఏలో భాగంగా న్యూఢిల్లీ వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన టీమిండియా 93 పరుగుల తేడాతో నమీబియాను చిత్తు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హార్దిక్ పాండ్యా(52, 2/21) ఆల్‌రౌండ్‌షోతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ సందర్భంగా మాట్లాడిన హార్దిక్ పాండ్యా.. పిచ్ బ్యాటింగ్‌కు కఠినంగా ఉందని చెప్పాడు. 'నేను నా ఆటను ఆస్వాదిస్తున్నాను. ఈ టోర్నీ కోసం గత రెండు నెలలు తీవ్రంగా కష్టపడ్డాను. నా ఆటకు దిష్టి తగలకూడదు. అంతా సవ్యంగా సాగుతోంది. నేను ఎప్పుడూ ఒక బ్యాటర్‌గా గర్వపడుతుంటాను. నా ఆట తీరు క్లిక్ అయినప్పుడు.. కేక్‌పై ఉండే అదనపు తీపి లాంటి అనుభూతి కలుగుతోంది. ప్రస్తుతం నా శరీరం బాగా సహకరిస్తోంది. ఇందుకోసం నేను చాలా కష్టపడ్డాను. ఫిట్‌నెస్ కోసం పడే శ్రమను ఇష్టపడుతాను. దేశం కోసం ఆడటమే నా తొలి ప్రాధాన్యత. టోర్నీకి నెల రోజుల ముందే నేను ఆర్మీ తరహా శిక్షణా శిబిరంలో పాల్గొంటాను. మాకు చాలా ఆప్షన్లు ఉన్నాయి. పేసర్లు, స్పిన్నర్ల విభాగం పటిష్టంగా ఉంది. వరుణ్, అక్షర్, కుల్దీప్ యాదవ్ కూడా అద్భుతమైన ప్రదర్శన చేశారు. వరుసగా ఈ రెండు పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా లేవు. ఈ రోజు వికెట్‌పై బంతి ఆగుతూ వచ్చింది. మనం కేవలం పరిస్థితులకు అనుగుణంగా మారి నైపుణ్యంతో రాణించాలి. రాబోయే మ్యాచ్‌లకు మరికొంత ఫ్లాట్ వికెట్లు ఉండాలని కోరుకుంటున్నాం.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు.

## రోహిత్ రికార్డు సమం చేసిన ఇషాన్

టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా కుర్రాడు ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఈ వికెట్ కీపర్ బ్యాటర్ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. స్టేడియం నలుమూలలా సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడుతూ నమీబియా బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్కును అందుకున్న ఇషాన్, ఓవరాల్‌గా 24 బంతుల్లో 61 పరుగులు చేసి భారత్‌కు భారీ స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో హైలైట్ ఏదైనా ఉందంటే అది పవర్‌ప్లే చివరి ఓవరే. నమీబియా బౌలర్ జేజే స్మిత్ వేసిన ఆ ఓవర్‌లో ఇషాన్ కిషన్ పూనకం వచ్చినట్లు ఆడాడు. మొదటి బంతి డాట్ అయినప్పటికీ, ఆ తర్వాత వరుసగా నాలుగు బంతులను సిక్సర్లుగా మలిచాడు. చివరి బంతికి ఫోర్ కొట్టి మొత్తం ఆ ఓవర్‌లో 28 పరుగులు పిండుకున్నాడు. దీనితో టీ20 ప్రపంచకప్‌లో ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో భారతీయ బ్యాటర్‌గా రోహిత్ శర్మ (2024 వరల్డ్ కప్) రికార్డును ఇషాన్ సమం చేశాడు. ఈ జాబితాలో 36 పరుగులతో యువరాజ్ సింగ్ (2007) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌లో 250 పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయడం విశేషం. కేవలం 20 బంతుల్లోనే 50 పరుగులు పూర్తి చేసుకున్న అతను, మొత్తం ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 5 కళ్లు చెదిరే సిక్సర్లు బాదాడు. ఓపెనర్‌గా వచ్చి పవర్‌ప్లేలోనే జట్టు స్కోరును వందకు చేరువ చేయడం వల్ల భారత్‌కు తిరుగులేని ఆధిపత్యం లభించింది. పవర్‌ప్లేను ఎలా వాడుకోవాలో ఇషాన్ తన ఇన్నింగ్స్ ద్వారా మరోసారి ప్రపంచానికి చాటి చెప్పాడు. నిజానికి ఇషాన్ కిషన్ గత కొంతకాలంగా జట్టుకు దూరంగా ఉన్నాడు. క్రమశిక్షణ చర్యలు, ఫామ్ లేమి వంటి కారణాలతో సెలెక్టర్లు అతడిని పక్కన పెట్టారు. అయితే పట్టువదలని విక్రమార్కుడిలా దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించి మళ్లీ నేషనల్ టీంలోకి వచ్చాడు. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో సెంచరీ బాది ఫామ్‌లోకి వచ్చిన ఇషాన్, ఇప్పుడు వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలో సత్తా చాటడం విశేషం. టీమిండియా టాప్ ఆర్డర్‌లో ఇలాంటి అగ్రెసివ్ బ్యాటర్ ఉండటం జట్టుకు కొండంత బలాన్నిస్తోంది. సూపర్ 8 దిశగా సాగుతున్న భారత్‌కు ఇషాన్ ఫామ్ చాలా ముఖ్యం. నమీబియా వంటి చిన్న జట్లపైనే కాకుండా పెద్ద జట్లపై కూడా ఇలాగే ఆడితే భారత్ రెండోసారి టీ20 కప్ గెలవడం పెద్ద కష్టమేమీ కాదు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో యంగ్ ఇండియా పవర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. ముఖ్యంగా ఇషాన్ లాంటి ఆటగాళ్లు క్లిక్ అయితే ప్రత్యర్థి ఎవరైనా సరే వణకాల్సిందే.



## ఆస్ట్రేలియా వీధుల్లో కూర్చున్న పాకిస్తాన్ హాకీ జట్టు!




పాకిస్తాన్‌కి చెందిన హాకీ జట్టు ఆస్ట్రేలియాలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. హోటల్ బిల్లు చెల్లించలేక దీనమైన పరిస్థితుల్లో వీధుల్లో జట్టు కూర్చోవలసి వచ్చింది. ప్రో లీగ్ రెండవ లెగ్ సందర్భంగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. జట్టు దగ్గర తగినంత డబ్బు లేకపోవడం కారణంగా.. టీంకు టీమే వీధుల్లో కూర్చోవాల్సిన పరిస్థితి ఎదురయింది. అయితే వారు అక్కడ అటు ఇటు తిరుగుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కొన్ని వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్తాన్ హాకీ జట్టుకు సంబంధించిన వారంతా ఫోర్ స్టార్ హోటల్లో బస.. అయితే పాకిస్తాన్ హాకీ జట్టుకు సంబంధించిన అధికారులు, పాకిస్తాన్ స్పోర్ట్స్ బోర్డ్ హోటల్ కోసం ప్రత్యేకమైన అడ్వాన్స్ ను చెల్లించినట్లు కూడా హాకీ జట్టుకు పేర్కొంది. అయితే, జట్టులో ఉన్న సభ్యులందరూ కాన్‌బెర్రా చేరుకున్న తర్వాత.. హోటల్ రిసెప్షన్ లో వారికి కేటాయించిన రూముల సమాచారాన్ని అడగ్గా...హోటల్ అధికారులు పాకిస్తాన్ ప్రభుత్వం ఎలాంటి బుకింగ్ చేయలేదని.. అలాగే అడ్వాన్స్ చెల్లించలేదని స్పష్టం చేశారు.

## టీ20 ప్రపంచకప్‌లో బోణీ కొట్టిన యూఏఈ

టీ20 ప్రపంచకప్‌లో యూఏఈ బోణీ కొట్టింది. శుక్రవారం కెనడాతో జరిగిన మ్యాచ్‌లో యూఏఈ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. కెనడా నిర్దేశించిన 151 పరుగుల టార్గెట్‌ను యూఏఈ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆర్యన్ష్ శర్మ (74 పరుగులు), షోయబ్ ఖాన్ (51 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించడంతో కెనడాకు ఓటమి తప్పలేదు. కెనడా బౌలర్లలో సాబ్ బిన్ 3, జస్కన్ సింగ్, ఖలీమ్ సనా తలో 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన కెనడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 150 పరుగులు చేసింది. హర్ష్ ఠాకర్ (50 పరుగులు), నవనీత్ ధళీవాల్ (34 పరుగులు) రాణించారు. యూఏఈ బౌలర్లలో జునైద్ సిద్దిఖ్ 5 వికెట్లతో ప్రత్యర్థి పతనం శాసించగా, మహ్మద్ జవాదుల్లాకు 1 వికెట్ దక్కింది.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# డబ్బు పెద్ద జబ్బు..

## వందల కోట్లు పోయినా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నా: జగపతిబాబు



టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతి బాబు హీరోగా, విలన్‌గా, ఎన్నో కీలక పాత్రల్లో మెప్పించిన సంగతి తెలిసిందే. సాధారణ జీవితాన్ని ఇష్టపడే ఆయన... తనది ఎన్నో ఎత్తులు, లోతులు చూసి మళ్లీ నిలబడిన జీవిత కథ అని చెబుతుంటారు. తాజాగా ఓ ప్రముఖ పాడ్‌కాస్ట్ షోలో ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా డబ్బు గురించి ఆయన చెప్పిన మాటలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి.జగపతి బాబు మాట్లాడుతూ... మనం డబ్బు వెంట పరిగెత్తకూడదని, అదే మన దగ్గరికి వచ్చేలా ఉండాలని సూచించారు. డబ్బు కేవలం అవసరాలను తీర్చే సాధనమేనని, ఒకప్పుడు స్టార్ హీరోగా ఉండి ఆ తర్వాత ఆర్థికంగా ఎన్నో ఒడిదుడుకులు చూసిన తనకు దాని విలువ బాగా తెలుసని చెప్పారు. ఈ రోజుల్లో మనిషి కంటే డబ్బుకే ఎక్కువ విలువ ఇస్తున్నారని, ఇది సమాజానికి చాలా ప్రమాదకరం అని ఆవేదన వ్యక్తం చేశారు.

డబ్బు పిచ్చి అనేది పెద్ద జబ్బు అని, దాని కోసం ప్రాణ స్నేహితులను, బంధువులను దూరం చేసుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. తాను వందల కోట్ల ఆస్తులు పోగొట్టుకున్నప్పటికీ ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నానని చెప్పారు. ప్రశాంతమైన నిద్ర, మంచి ఆహారం, ప్రేమగా పలకరించే మనుషులు ఉండటమే నిజమైన ఆస్తి అని తెలిపారు. డబ్బు కోసం అబద్ధాలు ఆడటం, వేషాలు వేయడం కంటే ఉన్నదానితో తృప్తిగా బతకడం మేలు అని జగపతి బాబు సందేశం ఇచ్చారు.



# 'కపుల్ ఫ్రెండ్లీ'తో

## తెరపైకి తెలంగాణ బ్యూటీ!

తెలుగు తెరపై ఈ మధ్య కాలంలో తెలుగు హీరోయిన్స్ జోరు పెరుగుతున్నట్టుగానే కనిపిస్తోంది. కొత్తగా ఇండస్ట్రీకి వస్తున్న దర్శకులు, కొత్త కథానాయికలను పరిచయం చేయడానికి ఎక్కువ ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. ఓ మాదిరి బడ్జెట్ సినిమాల ద్వారా పరిచయమవుతున్న ఈ కథానాయికలు, ఆ తరువాత తమ టాలెంట్ తో నిలదొక్కుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అటు ఆంధ్ర నుంచి మాత్రమే కాదు, ఇటు తెలంగాణ వైపు నుంచి కూడా పరిచయమవుతున్న హీరోయిన్ల సంఖ్య కూడా పెరుగుతోంది. వరంగల్ నుంచి తెలుగు తెరకి పరిచయమైన ఆనంది, తమిళంలో స్టార్ డమ్ ను సంపాదించుకుంది. ఇప్పటికీ తెలుగులో సినిమాలు చేస్తోంది. ఈషా రెబ్బా కూడా తనదైన స్టైల్లో సినిమాలు .. సిరీస్ లు చేస్తూ వెళుతోంది. ఇక వైష్ణవి చైతన్య 'బేబీ' సినిమాతో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు 'మానస వారణాసి' పేరు ఎక్కువగా వినిపిస్తోంది. అందాల పోటీల్లో అనేక బహుమతులు గెలుచుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో అలరించనుంది. మానస వారణాసి ఇంతకు ముందు ఒక సినిమా చేసినప్పటికీ, కొన్ని కారణాల వలన అది ఆడియన్స్ కి రీచ్ కాలేదు. 'కపుల్ ఫ్రెండ్లీ' మాత్రం రిలీజ్ కి ముందే మంచి బజ్ తెచ్చుకుంది. 'వాలెంటైన్స్ డే' సందర్భంగా ఈ నెల 14వ తేదీన ఈ సినిమాను రిలీజ్ చేస్తూ ఉండటంతో, యూత్ అంతా ఈ సినిమాపైనే ఫోకస్ పెట్టింది. ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు, పొయెటిక్ గా అనిపించేలా రొమాన్స్ ఉంటుందని చెప్పడం యూత్ ను ఎక్కువగా ఆకర్షిస్తోంది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో, సంతోష్ శోభన్ జోడీగా మానస వారణాసి తొలి హిట్ కొడుతుందేమో చూడాలి మరి.



# సంయుక్త సైలెంట్ గానే



సంయుక్త మీనన్ కు మలయాళ సినీ ఇండస్ట్రీలో ఇప్పటికే మంచి గుర్తింపు ఉంది. అక్కడ చేసిన విభిన్న పాత్రల ద్వారా తన నటనా సామర్థ్యాన్ని ఋజువు చేసుకున్న ఆమె, ఇప్పుడు టాలీవుడ్ లో కూడా అదే దిశగా అడుగులు వేస్తున్నారు. నటనా ప్రాధాన్యమున్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ కెరీర్లో సంయుక్త మీనన్ ముందుకు వెళ్తున్నారు.

సంయుక్త రీసెంట్ టైమ్స్ లో గ్లామర్ కంటే యాక్టింగ్ ఓరియెంటెడ్ సినిమాలనే చేసుకుంటూ కెరీర్లో ముందుకెళ్తున్నారు. ప్రస్తుత కాలంలో గ్లామర్ కంటే నటనకు ప్రాధాన్యమిచ్చే హీరోయిన్ల కొరత ఎక్కువవుతున్న నేపథ్యంలో సంయుక్త తనకంటూ ప్రత్యేకమైన స్థానం ఏర్పరచుకుంటున్నారు. సంయుక్త స్క్రీన్ పై సైలెంట్ గా కనిపించినా, ఫ్రేమ్ ను తనవైపు తిప్పుకునే సామర్థ్యం ఆమెకుంది.రీసెంట్ గా సంయుక్త నటించిన సినిమాల్లో స్క్రీన్ పై ఆమె కనిపించే టైమ్ తక్కువైనా, తన ప్రెజెన్స్ తో ఆడియన్స్ దృష్టిని పూర్తిగా ఆకర్షించే శక్తి ఆమెకు ఉందని తాజాగా మరోసారి ప్రూవ్ అయింది. రీసెంట్ గా శర్వానంద్ నటించిన నారీ నారీ నడుమ మురారి సినిమాలో సంయుక్త క్యారెక్టర్ పెద్దది కాకపోయినా, తెరపై కనిపించిన ప్రతీ ఫ్రేమ్‌లోనూ ఆమె స్పెషల్ ఇంపాక్ట్ చూపించింది.కళ్లలో ఆకర్షణ, ఎమోషన్స్ ను పలికించడంతో పాటూ మంచి డైలాగ్ డెలివరీ.. ఈ మూడు అంశాలు సినిమాలో ఆమె క్యారెక్టర్ ను హైలైట్ చేశాయి. కథలో భాగంగా మాత్రమే కాకుండా సీన్ కు బలం చేకూర్చే నటిగా సంయుక్త నటించిన విధానం అందరినీ ఆకట్టుకుంది. ఇక రీసెంట్ గా వచ్చిన స్వయంభు టీజర్ లో కూడా అదే అంశం స్పష్టమైంది.

స్వయంభు మూవీలో నభా నటేష్ గ్లామర్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ, సంయుక్త మాత్రం యోధురాలిలా కనిపిస్తూ టీజర్ తోనే తనదైన ముద్ర వేశారు. టీజర్ లో ఆమె లుక్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ షాట్స్ లో కనిపించిన తీరు ఇవన్నీ హైలైట్ గా నిలవగా, గ్లామర్ కు భిన్నంగా, కంటెంట్ ఆధారంగా నిలిచే పాత్రలను ఎంచుకుంటూ ఆమె సైలెంట్ గానే తన కెరీర్ గ్రాఫ్ ను పెంచుకుంటున్నారు. చిన్న పాత్ర అయినా, పెద్ద ఇంపాక్ట్ చూపించగల నటిగా సంయుక్త మీనన్ పేరు బలంగా వినిపిస్తోంది. స్వయంభు లాంటి ప్రాజెక్టులు ఆమెకు మరిన్ని అవకాశాలు తెచ్చి పెట్టే అవకాశముంది.


# అల్లు శిరీశ్ పెళ్లి సందడి ప్రారంభం..




టాలీవుడ్ హీరో, అల్లు అర్జున్ సోదరుడు అల్లు శిరీశ్ పెళ్లి పనులు ప్రారంభమయ్యాయి. నయనికతో అల్లు శిరీశ్ పెళ్లి మార్చి 6న జరగనుంది. గత నెల దుబాయ్‌లో ప్రీ-వెడ్డింగ్ సెలబ్రేషన్స్ ఘనంగా జరిపారు. ఇప్పుడు హైదరాబాద్ లోని అల్లు అరవింద్ ఇంట్లో నిన్న సంప్రదాయబద్ధంగా పసుపు దంచుకునే కార్యక్రమం జరిగింది.

సాధారణంగా హల్దీ పేరుతో ఈ ఫంక్షన్లను జరుపుకుంటుంటారు. కానీ, హల్దీ ఫంక్షన్ కు 'నో' చెప్పి... ఇంట్లోనే సంప్రదాయ పద్ధతిలో పసుపు దంచుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ వేడుకలో పవన్ కల్యాణ్ భార్య అన్నా లెజినోవా, బన్నీ భార్య స్నేహ, చిరంజీవి పెద్ద కూతురు సుస్మిత, ఇతర బంధువులు, పిల్లలు పాల్గొన్నారు. సోషల్ మీడియాలో ఈ కార్యక్రమం వీడియోను శిరీశ్ పోస్ట్ చేశాడు. ఫ్యామిలీ ఫంక్షన్ సరదాగా, సంతోషంగా సాగింది. పెళ్లి వేడుకలు ఇక మరింత జోరుగా సాగనున్నాయి.

# కంబ్యాక్ కోసం క్రిష్ భారీ ప్రయత్నాలు



టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసుకున్న దర్శకుల్లో క్రిష్ జగర్లమూడి ఒకరు. 'గమ్యం', 'వేదం', 'గౌతమీపుత్ర శాతకర్ణి' వంటి సినిమాలతో కథనంలో సార్వత్రికత, ఎమోషనల్ డెప్త్, సామాజిక అంశాలపై తన దృష్టిని చాటుకున్న క్రిష్.. ఒక దశలో కంటెంట్ ఓరియెంటెడ్ డైరెక్టర్ గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే గత కొంతకాలంగా ఆయన కెరీర్ ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదనేది మాత్రం ఒప్పుకోవాల్సిన వాస్తవం.

గతేడాది అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో ఘాటీ అనే లేడీ ఓరియెంటెడ్ సినిమాను తీయగా, భారీ అంచనాలతో వచ్చిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. కథలో ఉన్న డెప్త్ ఆడియన్స్ కు పూర్తిగా కనెక్ట్ కాలేదనే వాదనలు కూడా వ్యక్తమయ్యాయి. దానికి తోడు సగానికి పైగా క్రిష్ దర్శకత్వంలోనే తెరకెక్కిన హరి హర వీరమల్లు కూడా ఎన్నో ఇబ్బందుల తర్వాత రిలీజై అనుకున్న ఫలితాన్ని అందుకోకపోవడంతో ఈ రెండు సినిమాల ఫలితాలతో క్రిష్ ప్రస్తుతం సరైన ఫామ్ లో లేకుండా పోయారు. ఈ నేపథ్యంలోనే క్రిష్ తన కంబ్యాక్‌పై దృష్టి సారించినట్లు సమాచారం. భారీ స్థాయిలో ఓ కొత్త ప్రాజెక్టును ప్లాన్ చేస్తున్నక్రిష్, తన నెక్ట్స్ మూవీని మరింత స్పెషల్ గా తెరకెక్కించనున్నట్టు తెలుస్తోంది. ఏకంగా ఏడుగురు హీరోయిన్లతో క్రిష్ సరికొత్త ప్రయత్నం చేస్తున్నారని ఫిల్మ్ నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే క్రిష్ సినిమాలో నటించే ఆ ఏడుగురు భామలెవరనేది మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు.

# శ్రీరామనవమికి రామ్ చరణ్, సుకుమార్ చిత్రానికి ముహూర్తం !




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ అభిమానులకు పండగలాంటి వార్త అందింది. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న కొత్త సినిమా షూటింగ్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైనట్టు తెలుస్తోంది. శ్రీరామనవమి పర్వదినమైన మార్చి 26న ఈ చిత్రం పూజా కార్యక్రమాలు ఉంటాయని టాక్ వినిపిస్తోంది.మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు కాగా, దానికి ఒకరోజు ముందు పవిత్రమైన శ్రీరామనవమి రోజునే ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించే అవకాశాలున్నాయి. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్ లేదా టైటిల్ అనౌన్స్‌మెంట్ వెలువడవచ్చని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'రంగస్థలం' తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఇదిలా ఉండగా, రామ్ చరణ్ నటిస్తున్న మరో చిత్రం 'పెద్ది' నుంచి ఆయన పుట్టినరోజు (మార్చి 27) నాడు ప్రత్యేక అప్‌డేట్ రానున్నట్లు తెలుస్తోంది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న విడుదల చేయనున్నారు. 'పెద్ది' దర్శకుడు బుచ్చిబాబు సుకుమార్ శిష్యుడు కావడం, ఆ సినిమా నిర్మాణంలో సుకుమార్ భాగస్వామిగా ఉండటంతో ఈ రెండు ప్రాజెక్టులపైనా ప్రేక్షకుల్లో ఆసక్తి రెట్టింపు అయ్యింది. ఇటీవలే కవల పిల్లలకు తండ్రైన రామ్ చరణ్‌కు, ఆయన అభిమానులకు మార్చి నెల డబుల్ బొనాంజాగా మారనుంది. ఒకవైపు సుకుమార్ సినిమా ప్రారంభం, మరోవైపు 'పెద్ది' నుంచి సర్‌ప్రైజ్ అప్‌డేట్‌తో ఫ్యాన్స్ సంబరాలకు సిద్ధమవుతున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613